RNI : TGMUL/25/A1386

# తొలి అక్షరం

మా అక్షరమే - మీ అయుధంగా...

చైర్మన్& చీఫ్ ఎడిటర్ పస్తం సైదులు

www.tholiaksharam.com

ఎడిటర్: పి.సైదులు, సంపుటి : 03 సంచిక - 254 పేజీలు - 08 ఆదివారం 09 ఆగస్టు 2026

## తొలి పలుకు

అతి తక్కువ కాలంలో అన్ని వర్గాల్లో విశేష ఆదరణ పొందుతున్న తొలి అక్షరం దినపత్రిక నిష్పక్షపాత విశ్వసనీత సమాచారంతో డిజిటల్ రంగంలో అగ్రస్థానంలోకి అడుగుపెడుతున్న తరుణంలో పాఠక మహాశయుల ఆదరాభిమానం మన్నల్ని పొందుతూ దూసుకుపోతున్న తొలి అక్షరం తెలుగు దినపత్రిక సూర్యోదయంతో పాటే పాఠకుల ముందుకు వస్తూ రాష్ట్రస్థాయిలో దేశస్థాయిలో ప్రపంచ స్థాయిలోని సమాజంలోని అన్ని రంగాల్లోని సంబంధిత అంశాలపై సమాచార వ్యాప్తిలో ముందుంటుంది. ఎప్పటికప్పుడు సమాచారాన్ని ముందు ఉంచడంలో తొలి అక్షరం దినపత్రిక అనేక మంది పాఠకుల ఆధార అభిమానాలు పొందుతుండడం విశేషంగా భావిస్తూ.. ఇదేవిధంగా పాఠకులు ఆదరాభిమానాలు ఇలాగే కొనసాగాలని ఆశిస్తూ....

- పి.సైదులు ఎడిటర్ తొలి అక్షరం దినపత్రిక



# ప్రశ్నలతో ఆగొద్దు.. పరిష్కారాలు చూపండి

**యువత సామర్థ్యాలపై పూర్తి నమ్మకం ఉంది**

**వారి ఆలోచనలు, నిర్ణయాలే వికసిత్ భారత్‌కు దిశానిర్దేశం : ప్రధాని మోడీ**

**ఐఐటీ ఢిల్లీ స్నాతకోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరు**

**తొలి అక్షరం/న్యూఢిల్లీ,ఆగస్టు 08:** దేశ యువత సమస్యలను గుర్తించి ప్రశ్నించడం మాత్రమే కాకుండా, వాటికి పరిష్కారాలను కనుగొనే దిశగా ఆలోచించాలని ప్రధాని మోడీ సూచించారు. యువత సామర్థ్యాలపై తనకు పూర్తి నమ్మకం ఉందని అన్నారు. వికసిత్ భారత్ నిర్మాణంలో యువత కీలక పాత్ర పోషించాల్సి ఉందని పిలుపునిచ్చారు. ఐఐటీ ఢిల్లీ స్నాతకోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మోడీ..పట్టభద్రులైన విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. విద్యార్థులు ఇప్పుడు అడుగుపెడుతున్న ప్రపంచం వేగంగా మారుతోందని చెప్పారు. సాంకేతికతతో పాటు అనేక రంగాల్లో విప్లవాత్మక మార్పులు చోటు చేసుకుంటున్నాయ న్నారు. రాబోయే 20--30 ఏండ్లలో ప్రపంచంలో ఎలాంటి మార్పులు మిగతా2లో...

# ఎల్‌నినోతో సాగునీటికి కష్టాలు

**సాగర్ నీళ్లు తాగడానికే సరిపోవు**

**రైతులు ఆరుతడి పంటలనే వేయాలి**

**సాగునీటి సలహామండలి సమావేశంలో కోమటిరెడ్డి**




**తొలి అక్షరం/నల్గొండ ఆగస్టు 08:** ఎల్‌నినో కారణంగా ప్రస్తుతం నాగార్జునసాగర్ ప్రాజెక్టులో ఉన్న నీరు తాగునీటికే సరిపోతుందని, అంతేకాక పైనుంచి నీరు వచ్చే అవకాశం కూడా లేనందున రైతులు ఎట్టి పరిస్థితుల్లోనూ వరి వేయకుండా ఆరుతడి పంటలు వేసుకునేలా అధికారులు అవగాహన కల్పించాలని మిగతా2లో...

# ప్రాజెక్టుల భూసేకరణకు రూ. 5వేల కోట్లు

**అటవీ, పర్యావరణ అనుమతులపై నిర్లక్ష్యం వద్దు**

**మిడ్ మానేర్ ఎడమ కాలువ పనుల పునః ప్రారంభం : నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి**



**తొలి అక్షరం/హైదరాబాద్, ఆగస్టు 08:** సాగునీటి ప్రాజెక్టుల భూసేకరణ, పునరావసం కోసం రూ.5 వేల కోట్లు మంజూరు చేశామని నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి అన్నారు. నిధుల కొరత కారణంగా సాగునీటి పనులు ఆగొద్దని పేర్కొన్నారు. శనివారం హైదరాబాద్‌లోని బీర్.అంబేద్కర్ సచివాలయంలో ఉమ్మడి కరీంనగర్ జిల్లా సాగునీటి ప్రాజెక్టులపై మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, డి. శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌తో కలిసి సమీక్ష నిర్వహించారు. ఇందులో ఇప్పటికే రూ.2 వేల కోట్లు విడుదలయ్యాయనీ, మిగిలిన రూ.3 వేల కోట్లు ప్రాధాన్యతా క్రమంలో మిగతా2లో...

# క్షుద్ర రాజకీయాలు కాంగ్రెస్‌కే చెల్లు

- తెలంగాణ కోసం కొట్లాడిన మాకు తెలియదు
- నీటి వాటాల విషయంలో తేడా వస్తే తెలంగాణ భగ్గుమంటది
- నీళ్లు ఎత్తిపోయడం కూడా చేతకాని సిఎం రేవంత్ రెడ్డి
- మీడియా సమావేశంలో మండిపడ్డ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

**తొలి అక్షరం/హైదరాబాద్,ఆగస్టు 08:** క్షుద్రపూజలు అని చెప్పి క్షుద్ర రాజకీయాలు చేస్తున్నది కాంగ్రెస్ పార్టీయేనని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. తెలంగాణ కోసం కొట్లాడిన వాళ్లం. తెలంగాణ కోసం త్యాగాలు చేసిన వాళ్లం. క్షుద్ర రాజకీయాలు చేయవలసిన అవసరం మిగతా2లో...




# డిలిమిటేషన్‌పై తమిళనాట ఆసక్తికర సన్నివేశం

**సిఎం విజయ్ నేతృత్వంలో అఖిలపక్ష ఎంపిల భేటీ**

**ఉన్న ఎంపి సీట్లను అలాగే కొనసాగించాలని డిమాండ్**




**తొలి అక్షరం/చెన్నై,ఆగస్టు 08:** కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదిస్తున్న 'డీలిమిటేషన్' పక్రియపై తమిళనాడు రాజకీయాల్లో తీవ్ర ఉత్కంఠ నెలకొంది. రాష్ట్ర రాజకీయ ప్రాతినిధ్యం తగ్గకుండా అడ్డుకునేందుకు ముఖ్యమంత్రి సి. జోసెఫ్ విజయ్ శనివారం చెన్నైలోని కలైవానర్ అరంగంలో తమిళనాడు ఎంపీలతో అత్యవసర సమావేశం నిర్వహించారు. అయితే, రాష్ట్రంలోని ప్రధాన రాజకీయ పార్టీలైన డీఎంకే, అన్నాడీఎంకేలతో పాటు పీఎంకే, డీఎండీకే ఈ భేటీని బహిష్కరించడం చర్చనీయాంశమైంది. పార్టీ రాజకీయాలకు అతీతంగా తమిళనాడు హక్కుల పరిరక్షణెళి లక్ష్యంగా కాంగ్రెస్, విసికె, సిపిఐ సిపిఎం, ఎండిఎంకె, ఐయూఎంఎల్ పార్టీలకు చెందిన దాదాపు 21 మంది లోక్‌సభ, రాజ్యసభ ఎంపీలు ఈ భేటీలో మిగతా2లో...



## నేడు,రేపు హైదరాబాద్

# బోనాలు

- పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ ఆంక్షలు

**తొలి అక్షరం/హైదరాబాద్,ఆగస్టు 08:** హైదరాబాద్‌లో బోనాల ఉత్సవాలు ఆగస్టు 9, 10 తేదీల్లో జరగనున్న నేపథ్యంలో పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ మళ్లింపులు చేపట్టినట్లు ట్రాఫిక్ పోలీసులు పేర్కొన్నారు. లాల్ దర్వాజా, కార్వాన్ దర్బార్ మైసమ్మ, అంబర్‌పేట్ మహంకాళి, చిలకలగూడ కట్ట మైసమ్మ ఆలయాల పరిసరాల్లో ట్రాఫిక్ ఆంక్షలు విధించినట్లు వెల్లడించారు. లాల్ దర్వాజా బోనాల మిగతా2లో...

# నిరుద్యోగులంటే ఎందుకింత కక్ష

**● సరూర్ నరగ్ ఘటన ముమ్మాటికీ ప్రభుత్వ వైఫల్యమే ● రెండు లక్షల ఉద్యోగాలు భర్తీ హామీ మోసానికి నిదర్శనం ● ఎక్స్ వేదికగా మండిపడ్డ బిఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్ రావు**



**తొలి అక్షరం/హైదరాబాద్, ఆగస్టు 08:** హైడ్రాలో డ్రైవర్ పోస్టుల భర్తీకి వచ్చిన నిరుద్యోగులను ప్రభుత్వం అవమానించిందంటూ బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్ రావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. నిరుద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. సోషల్ మీడియా ఎక్స్ వేదికగా స్పందిస్తూ.. విద్యార్థులు, నిరుద్యోగులు అంటే ప్రభుత్వానికి ఎందుకింత కక్ష అంటూ మండిపడ్డారు. అధికారంలోకి వచ్చిన మొదటి ఏడాదిలోనే రెండు లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేస్తూ.. 32 నెలలు దాటినా ఇచ్చిన హామీని నిలబెట్టుకోలేదని దుయ్యబట్టారు. రెండు లక్షల ఉద్యోగాల హామీ బోగస్ అయ్యిందంటూ ఫైర్ అయ్యారు. అధికారం కోసం ఎన్నికల సమయంలో విద్యార్థులు, నిరుద్యోగులను నెత్తిన పెట్టుకున్నారు. ఉద్యోగాలు ఇస్తామని హామీలు గుప్పించారు. ఇప్పుడు అదే నిరుద్యోగులు ఉద్యోగాల కోసం రోడ్ల మీదకు వస్తే వారి పట్ల ఇంత కర్కశంగా వ్యవహరిస్తారా అని ప్రశ్నించారు. హైడ్రాలో కేవలం 150 డ్రైవర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ ఇస్తే వేలాది మంది నిరుద్యోగులు దరఖాస్తు చేసుకునేందుకు తరలివచ్చారు. ఇది నిరుద్యోగుల తప్పా లేక మిగతా2లో...

# ఇకనుంచి స్మార్ట్ రేషన్ కార్డులు

**15 ఆగస్ట్‌న ప్రారంభించనున్న సిఎం**



# ప్రశ్నలతో ఆగొద్దు..పరిష్కారాలు చూపండి

(మొదటి పేజీ తరువాయి)

వస్తాయో ముందుగానే చెప్పడం సాధ్యం కాదని చెప్పారు. అందువల్ల యువతలో ఎప్పుడూ నేర్చుకోవాలనే ఆసక్తి ఉండా లన్నారు. జీవితాంతం విద్యార్థులుగా కొనసాగాలని సూచించారు. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా కొత్త విషయాలను నేర్చుకునేవారే విజయాన్ని అందుకుంటారని తెలిపారు. **సమస్యలను చూసి భయపడొద్దు** జీవితంలో వచ్చే సమస్యలను చూసి భయపడాల్సిన అవసరం లేదని, పెద్ద సవాళ్లను చిన్న చిన్న భాగాలుగా విభజించి వాటికి పరిష్కారాలను అన్వేషించాలని మోడీ సూచించారు. కొత్త ఆలోచనలు, వినూత్న పరిష్కారాలను కనుగొనే ధైర్యం ఉంటే సవాళ్లను అవకాశాలుగా మార్చుకోవచ్చునన్నారు. ప్రతి తరానికీ దేశం పట్ల బాధ్యత ఉంటుందని మోడీ వివరించారు. రాబోయే 30--35 ఏండ్లలో యువత తీసుకునే నిర్ణయాలు, చేపట్టే కార్యక్రమాలే వికసిత్ భారత్ దిశను ప్రభావితం చేస్తాయని అన్నారు. తాము తీసుకునే ప్రతి నిర్ణయం దేశానికి ఎంతవరకు ఉపయోగపడుతుందో యువత ఆలోచించాలని పిలుపునిచ్చారు. దేశ ప్రయోజనాల కోసం తాము ఏమి చేయగలమనే ప్రశ్నను ప్రతి యువకుడు తనకు తాను వేసుకోవాలని మోడీ సూచించారు.

**విద్యార్థులకు స్వర్ణ పతకాలు ప్రదానం**
స్నాతకోత్సవంలో ప్రతిభ కనబరిచిన పలువురు విద్యార్థులకు దీన్‌దయాల్ శర్మ స్వర్ణ పతకం, డైరెక్టర్ స్వర్ణ పతకాలను మోడీ ప్రదానం చేశారు. పురస్కారాలు అందుకున్నవారిలో మహిళల సంఖ్య తక్కువగా ఉండటాన్ని ఆయన ప్రస్తావిస్తూ.. మరింత మంది మహిళలు ఈ స్థాయిలో ప్రతిభ చూపాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం ఐఐటీ ఢిల్లీ సోనిపత్ క్యాంపస్‌లో ఏర్పాటు చేసిన ఏఐ ఆధారిత సూపర్ కంప్యూటింగ్ కేంద్రం 'పరం ప్రజ్ఞ'ను ప్రధాని ప్రారంభించారు.

# డిలిమిటేషన్‌పై తమిళనాట ఆసక్తికర సన్నివేశం

(మొదటి పేజీ తరువాయి)

పాల్గొన్నారు. దేశ వ్యాప్తంగా లోక్‌సభ స్థానాల సంఖ్యను 543 వద్దే ఉంచాలని ఈ సందర్భంగా ఎంపీలు డిమాండ్ చేశారు. తమిళనాడుకు ప్రస్తుతం ఉన్న 39 లోక్‌సభ స్థానాల కేటాయింపులో ఎలాంటి మార్పులు చేయకూడదని స్పష్టం చేశారు. దశాబ్దాలుగా తమిళనాడు, కేరళ వంటి దక్షిణాది రాష్ట్రాలు జనాభా నియంత్రణను సమర్థవంతంగా అమలు చేశాయని ఎంపీలు గుర్తుచేశారు. ఇప్పుడు కేవలం జనాభా ప్రాతిపదికన నియోజకవర్గాల సంఖ్యను పెంచితే, జనాభా పెరిగిన ఉత్తరాది రాష్ట్రాలకు లబ్ధి చేకూరి, దక్షిణాది రాష్ట్రాల రాజకీయ ప్రాతినిధ్యం తీవ్రంగా తగ్గుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. తమిళనాడు పాత్రను పార్లమెంట్‌లో తగ్గించే ఏ డీలిమిటేషన్ సూత్రాన్నైనా తీవ్రంగా నిరసిస్తామని, లోక్‌సభ స్థానాల సంఖ్యను పెంచితే అది ప్రభావవంతమైన పార్లమెంట్ కాబోదని కాంగ్రెస్ ఎంపీ కార్తీ చిదంబరం పేర్కొన్నారు. తమిళనాడును ఇన్నేళ్లు పాలించిన డీఎంకే, అన్నాడీఎంకేలు రాష్ట్ర హక్కుల కోసం నిర్వహిస్తున్న భేటీకి రాకపోవడం విచారకరమని, వారికి రాష్ట్ర ప్రజల ప్రయోజనాల కంటే రాజకీయాలే ముఖ్యమని కాంగ్రెస్ ఎంపీలు ప్రవీణ్ చక్రవర్తి, విష్ణు ప్రసాద్ విమర్శించారు. తమిళనాడు రాష్ట్రానికి చెందిన 57 మంది ఎంపీలలో 36 మంది ఈ భేటీకి దూరంగా ఉండటం, విజయ్ ప్రభుత్వానికి స్పష్టమైన ఎజెండా లేదంటూ డీఎంకే ఆరోపించడం.. తమిళనాడు రాజకీయ సమీకరణాలను మరింత ఆసక్తికరంగా మార్చాయి.

# ప్రాజెక్టుల భూసేకరణకు రూ. 5వేల కోట్లు

(మొదటి పేజీ తరువాయి)

విడుదల చేస్తామని చెప్పారు. నిధుల కొరత కారణంగా చివరి దశలో ఉన్న ఏ సాగునీటి ప్రాజెక్టు కూడా నిలిచిపోవడానికి వీల్లేదని స్పష్టం చేశారు. ప్రాజెక్టుల నిర్మాణంలో భూసేకరణ, ఆర్అండ్ఆర్, అటవీ, పర్యావరణ అనుమతులను అత్యంత ప్రాధాన్య అంశాలుగా తీసుకోవాలని కలెక్టర్లను మంత్రి ఆదేశించారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ప్రాజెక్టుల వారీగా ఎన్ని నిధులు అవసరమో వెంటనే ప్రతిపాదనలు పంపాలనీ, అవసరమైన ఆర్థిక అనుమతులు, టోకెన్లు పొందడంలో జాప్యం చేయవద్దని సూచించారు. నాలుగున్నరేండ్లుగా నిలిచిపోయిన మిడ్‌మానేరు ఎడమ కాలువ మిగులు పనులను తక్షణమే పునఃప్రారంభించాలని మంత్రి ఆదేశించారు.సవరించిన అంచనాలు సిద్ధం చేయడం, భూసేకరణ, టెండర్ల ప్రక్రియ, చట్టబద్ధ అనుమతుల సాధన... ఒకదాని తర్వాత మరొకటి కాకుండా సమాంతరంగా ముందుకు సాగాలని స్పష్టం చేశారు. పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలంలో ప్రతిపాదించిన లక్ష్మీనరసింహస్వామి పత్తిపాక రిజర్వాయర్‌ను వేగంగా ముందుకు తీసుకెళ్లాలని ఆదేశించారు. ఈ పథకం ద్వారా కొత్తగా 10 వేల ఎకరాలకు సాగునీరు అందించడంతోపాటు కాకతీయ ప్రధాన కాలువలో డి-83 నుంచి డి-94 వరకు ఉన్న 2.40 లక్షల ఎకరాల ఆయకట్టును స్థిరీకరించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందన్నారు.
లైడార్ సర్వే, డేటా ప్రాసెసింగ్ ఇప్పటికే పూర్తయ్యాయనీ, బోర్‌హోల్ డ్రిల్లింగ్, ట్రయల్ పిట్స్, జియోటెక్నికల్ పరిశోధనలు కొనసాగుతున్నా యని అధికారులు మంత్రికి వివరించారు. ఆగస్టు నెలాఖరులోగా డీపీఆర్ సమర్పిస్తామని తెలిపారు. సమీక్షలో ప్రజాప్రతినిధులు ప్రస్తావించిన ప్రతి సమస్యను 'యాక్షన్ పాయింట్'గా మార్చాలని, తదుపరి సమావేశం నాటికి వాటిపై తీసుకున్న చర్యల నివేదికను సమర్పించాలని అధికారులకు సూచించారు. **రోళ్లవాగు 96 శాతం పూర్తి.....** జగిత్యాల జిల్లా బీర్‌పూర్ మండలంలోని రోళ్లవాగు ప్రాజెక్టు పనులు 96 శాతం పూర్తయ్యాయని అధికారులు మంత్రికి వివరించారు. ప్రస్తుతం ఉన్న 0.250 టీఎంసీల నిల్వ సామర్థ్యాన్ని 0.949 టీఎంసీలకు పెంచి, స్థానిక పరీవాహక ప్రాంతం నుంచి లభించే నీటిని సమర్థవంతంగా వినియోగించుకోవడం ద్వారా చివరి ఆయకట్టులోని దాదాపు 15 వేల ఎకరాలకు సాగునీటి భరోసా కల్పించడం ప్రాజెక్టు లక్ష్యమని పేర్కొన్నారు. సర్‌ప్లస్ వీర్, హెడ్ స్లూయిస్‌లతో సహా ప్రధాన నిర్మాణాలు దాదాపుగా పూర్తయ్యాయని తెలిపారు. బండ్-2లో కొంత భాగం అటవీ భూమిలో ఉండటంతో మిగిలిన పనులు అటవీ అనుమతుల కోసం ఎదురుచూస్తున్నా యని చెప్పారు. సాంకేతికంగా ఉన్న సమస్యలను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసి వెంటనే ప్రాజెక్టును వాడుకలో తీసుకు రావాలని అధికారులకు మంత్రి ఉత్తమ్ సూచించారు. సమీక్షలో కరీంనగర్, పెద్దపల్లి, జగిత్యాల, సిరిసిల్ల జిల్లాల కలెక్టర్లతో పాటు ఇంజినీర్-ఇన్-చీఫ్ ఓవి. రమేష్‌బాబు, నీటిపారుదల శాఖ జాయింట్ సెక్రెటరీ కె. శ్రీనివాస్ పాల్గొన్నారు.

# క్షుద్ర రాజకీయాలు కాంగ్రెస్‌కే చెల్లు

(మొదటి పేజీ తరువాయి)

తమకు లేదని వెల్లడించారు. అధికారంలో ఉన్నా లేకున్నా తెలంగాణ బాగుండాలని కోరుకుంటాం. కాంగ్రెస్ లాగా పార్టీ క్షుద్ర రాజకీయాలు మాకు తెలియదని పేర్కొన్నారు. హరీష్ రావు గుడికి పోతే తప్పా? ఇలాంటి చిల్లర రాజకీయాలు చేయవచ్చా? కాంగ్రెస్ పార్టీలాగా మేడిగడ్డకు, చెక్ డ్యామ్‌లోనూ ధ్వంసం చేసి ఓట్లు దండుకోవాలని చూడలేదని ఆరోపించారు. నీళ్లు ఉన్నా కూడా రైతులను ఎండబెట్టే కాంగ్రెస్ సంస్కృతి బీఆర్ఎస్‌ది కాదని అన్నారు. కరెంటు ఉండి కూడా వ్యవసాయదారుడికి 24 గంటల కరెంట్ ఇవ్వడం లేదు. ఏ సబ్ స్టేషన్‌కైనా రావడానికి మేము సిద్ధం. 24 గంటల కరెంట్ వస్తే ఇంకా ఎక్కడ ఉందో చెప్పాలి. కనీసం ఐదు, ఆరు సార్లు ప్రతిరోజూ కరెంట్ కోతలు అవుతున్నాయని విమర్శించారు. కోర్టులు చెప్పినా హైడ్రా విషయంలో రేవంత్ రెడ్డి అనుసరిస్తున్న వైఖరిని ప్రజాస్వామిక వాదులు గుర్తించాలని కేటీఆర్ విజ్ఞప్తి చేశారు. రేవంత్ రెడ్డి ప్రజా వ్యతిరేక, రాజ్యాంగ వ్యతిరేక ఆలోచనా విధానాన్ని గుర్తించాలని, రేవంత్ రెడ్డి హిట్లర్ అని చెప్పుకున్నట్లే రాజ్యాంగ వ్యవస్థలను పట్టించుకోవడం లేదని విమర్శించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రెండున్నర లక్షల మందికి 58 జీవో ద్వారా పట్టాలు ఇచ్చామని, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక ఒక్క పట్టా అయినా ఇవ్వలేదని, పైగా వేలాది మంది ఇళ్లను కూలగొట్టిందని ఆరోపించారు. హైదరాబాద్ లోని 10,000 ఎకరాల విలువైన భూమి పారిశ్రామిక భూముల విషయంలో రేవంత్ రెడ్డి చేస్తున్న 5 లక్షల కోట్ల స్కామ్ పైన రాష్ట్ర ప్రజలను జాగృతం చేస్తామని కేటీఆర్ వెల్లడించారు. హిల్ట్ పాలసీ ద్వారా రాష్ట్ర ప్రజల సొమ్మును ఏ విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం జేబులో వేసుకుంటుందో ప్రజలందరికీ అర్థమయ్యేలా లేఖల రూపంలో, ప్రజెంటేషన్ ల రూపంలో ప్రజల ముందు ఉంచుతామన్నారు. రైతులపై రేవంత్‌రెడ్డికి కనీస పరిజ్ఞానం లేదని తెలిపారు. తాము డిమాండ్ చేస్తేగానీ పంప్‌లు ఎందుకు ఆన్ చేయలేదని ప్రశ్నించారు. సీఎంకు ఎప్పుడు నీళ్లు ఎత్తిపోయాలో కూడా తెలియదని విమర్శించారు. హరీశ్‌రావు ఈ విషయంపై ప్రశ్నించినా కాంగ్రెస్ ప్రభుత్వం ఎందుకు స్పందించలేదని నిలదీశారు. సీఎం రేవంత్ దృష్టిలో భూమి అంటే రియల్ ఎస్టేట్ అని ఎద్దేవా చేశారు.కేంద్రమైనా, రాష్ట్రమైనా నష్టం కలిగించేలా వ్యవహరిస్తే తిరుగుబాటు తప్పదని కేటీఆర్ హెచ్చరించారు.కేంద్ర ప్రభుత్వాన్ని అడ్డు పెట్టుకొని తెలంగాణకు నీటి వాటాల్లో అన్యాయం చేస్తే, తెలంగాణ ఉద్యమానికి మించి మరొక ఆందోళన తెలంగాణలో వస్తుందని స్పష్టం చేశారు. హైదరాబాద్‌లోని నందినగర్‌లో మీడియాతో కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. వచ్చేవారం జరిగే జీఆర్ఎంబీ సమావేశం ఎజెండా ఎందుకు అంగీకరించారో ప్రభుత్వం స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశం ఎజెండా పూర్తిగా తెలంగాణ హక్కులను కాల రాస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. తెలంగాణ హక్కులను ఏ విధంగా కాపాడతారో రేవంత్, ఉత్తమ్ కుమార్ రెడ్డి సమాధానం చెప్పాలన్నారు. తెలంగాణ వ్యతిరేకి ఆదిత్యనాథ్ దాస్ ని సలహాదారుగా పెట్టుకోవడమే కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన సిగ్గుమాలిన చర్య అని విమర్శించారు. తెలంగాణలో ఒక్క ఇంజనీర్ కూడా లేరా? ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ చెప్పుచేతల్లోకి తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వం నడుస్తుంది. చంద్రబాబు చెప్పు చేతల్లో రేవంత్ రెడ్డి నడుస్తున్నాడు. రేవంత్ రెడ్డికి సిగ్గుంటే ఆదిత్యనాథ్ దాస్ ని తొలగించాలని డిమాండ్ చేశారు. నీళ్లు, నిధులు, నియామకాలతో కొట్లాడిన తెలంగాణలో మరోసారి నీళ్ల దోపిడీకి తెలంగాణ గురవుతున్నదని, ఇదే జరిగితే కచ్చితంగా బీఆర్ఎస్ మరోసారి నీళ్ల కోసం ఆందోళన చేయాల్సి వస్తుందని హెచ్చరించారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి సిగ్గు ఉంటే ఈ సమావేశాన్ని బహిష్కరించాలని సూచించారు. నార్లాపూర్‌ను ముట్టడించి పంపులను ఆన్ చేస్తామని బీఆర్ఎస్ హెచ్చరికలకు ప్రభుత్వం దిగివచ్చి పంపులని ఆన్ చేసిందని వెల్లడించారు. పాలమూరు బిడ్డ అని చెప్పుకునే రేవంత్ రెడ్డికి పాలమూరు నీళ్లు ఇచ్చే సోయి లేదు. వర్షాలు పడి పక్క రాష్ట్రం నీళ్లు ఎత్తి పోసుకుంటే ముఖ్యమంత్రికి పట్టింపు లేదు. ప్రధాన ప్రతిపక్షం ముళ్లు కట్టెతో పొడిస్తేనే ఈ ప్రభుత్వం స్పందిస్తుంది లేదంటే నిద్రపోతున్నదని పేర్కొన్నారు.

# నిరుద్యోగులంటే ఎందుకింత కక్ష

(మొదటి పేజీ తరువాయి)

ఉద్యోగాలు కల్పించడంలో విఫలమైన మీ ప్రభుత్వం తప్పా అని అన్నారు. ఇంజినీరింగ్ చదివిన విద్యార్థుల ను ముఖ్యమంత్రి స్థాయిలో 'క్రిమినల్ వేస్ట్' అని అవ మానించడం, ఉద్యోగాల కోసం వచ్చిన నిరుద్యోగులను అధికారులు దుర్భాషలాడటం చూస్తుంటే 'యథా రాజా.. తథా అధికారులు' అన్న సామెత గుర్తు కొస్తోంది. అధికారుల నోటివెంట ఇలాంటి మాటలు రావడం మరింత బాధాకరం. ఉద్యోగం కోసం వచ్చిన యువతను గౌరవంగా చూడాల్సిన అధికారులు వారినే అవమానిస్తే ఇక ఈ ప్రభుత్వం ఎవరి కోసం పనిచే స్తున్నట్టు అని అన్నారు. రెండు లక్షల ఉద్యోగాలు నిజం గా భర్తీ చేసి ఉంటే.. ఈరోజు 150 డ్రైవర్ పోస్టుల కోసం వేలాది మంది నిరుద్యోగులు ఇలా క్యూలలో నిలబడాల్సిన పరిస్థితి వచ్చేదా అని అన్నారు. నీ రెండు లక్షల ఉద్యోగాల హామీ బోగస్. నీ జాబ్ క్యాలెండర్ బోగస్. నిరుద్యో గులకు నువ్వు ఇచ్చిన హామీలు బో గస్. మీ పాలనలో ఉద్యోగాల కోసం ఎదురు చూస్తు న్న యువతలో నిరాశ పెరుగుతోంది. నోటిఫికే షన్లు సక్రమంగా రాకపోవడం తో పీజీ, పీహెచ్డీ వంటి ఉన్నత విద్య చదివిన యువత కూడా చిన్నచిన్న పోస్టు ల కోసం పోటీ పడాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు. ఇది ముమ్మాటికీ ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనం.

# ఇకనుంచి స్మార్ట్ రేషన్ కార్డులు

**• 15 ఆగస్టున ప్రారంభించనున్న సిఎం**

**తొలి అక్షరం/నిజామాబాద్,ఆగస్టు 08:** రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీకి జిల్లా పౌర సరఫరాల శాఖ సన్నద్ధమవుతోంది. స్మార్ట్ కార్డు విషయంలో దాదాపు 8 నెలల నుంచి ప్రభుత్వం చేసిన ఆలోచన ఎట్టకేలకు కార్యరూపం దాల్చనుంది. ఆగస్ట్ 15న సంగారెడ్డిలో సిఎం వీటిని ప్రారంభిస్తారు. ఈ స్మార్ట్ కార్డులతో బోగస్ కార్డుల ఎత్తివేత సులువవుతందని భావిస్తున్నారు. జిల్లాల వారిగా స్మార్డ్ కార్డు పంపిణీ అంశంపై శ రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పౌర సర ఫరాల శాఖ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర పౌరసరఫరాల శాఖ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. స్వాతంత్ర్య దినోత్సవం పురస్కరించుకొని ఆగస్టు 15 నుంచి స్మార్ట్ కార్డులను పంపిణీ చేసేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. ఆ రోజున ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సంగారెడ్డి జిల్లాలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ ప్రారంభిస్తారు. అదేరోజున మిగతా జిల్లాల్లో కూడా ప్రజా ప్రతినిధులు కార్డుల పంపిణీని లాంఛనంగా చేపడతారు. అయితే పంపిణీ వేదికలు, ఏర్పాట్లు తదితర అంశాలపై ఈనెల 11 వరకు స్పష్టత రానుంది. స్మార్ట్ రేషన్ కార్డు ఆకర్షణీయంగా ఉండనుంది. డ్రైవింగ్ లైసెన్స్, క్రెడిట్, డెబిట్ కార్డు సైజులో ఈజీగా వాలెట్‌లో పెట్టుకు నేలా ప్రభుత్వం రూపొందించింది. ఆధునిక సాంకేతిక విలువాలతో కార్డు ఆకర్షణీయంగా ఉంటుందని అధికా రులు అంటున్నారు. కొత్త కార్డుల దరఖాస్తు నిరంతర పక్రియ కావడంతో కార్డుల సంఖ్య పెరుగుతూనే ఉంటుంది. నిజామాబాద్ జిల్లాలో ప్రస్తుతం ఉన్న కార్డుల స్థానే కొత్త కార్డులను అందిస్తారు. ఈ మేరకు ఉమ్మడి జిల్లా అధికారులు జాబితాను సిద్దం చేశారు.

# నేడు,రేపు హైదరాబాద్ బోనాలు

(మొదటి పేజీ తరువాయి)

నేపథ్యంలో పాతబస్తీలో ఆగస్టు 9వ తేదీన ఉదయం 6 గంటల నుంచి, 10వ తేదీన ఉదయం 9 గంటల నుంచి ఊరేగింపు ముగిసే వరకు ట్రాఫిక్ మళ్లింపులు ఉంటాయని వెల్లడించారు. మదీనా ఎక్స్ రోడ్డు నుంచి ఇంజిన్ బౌలి (చార్మినార్, నాగుల్ చింతా మీదుగా) రహదారి బోనాల ఊరేగింపు పూర్తయ్యే వరకు పూర్తిస్థాయిలో ఈ రోడ్డును మూసివేస్తున్నట్లు ట్రాఫిక్ పోలీసులు వివరించారు. ఆర్టీసీ బస్సులు, భారీ వాహనాలకు చార్మినార్, ఫలక్‌నుమా వైపు నో ఎంట్రీ ఉంటుందని తెలిపారు. వాహనదారులను ప్రత్యామ్నాయ మార్గాల్లోకి మళ్లించినట్లు వెల్లడించారు. కార్వాన్ దర్బార్ మైసమ్మ బోనాల సందర్భంగా ఆగస్టు 8వ తేదీ రాత్రి 9 గంటల నుంచి ఆగస్టు 10వ తేదీ ఉదయం వరకు పురానాపూల్, జియాగూడ, టప్పాచబుత్రా పరిసరాల్లో ట్రాఫిక్ ఆంక్షలు విధించినట్లు పేర్కొన్నారు. అంబర్‌పేట్ మహంకాళి ఆలయం వద్ద ఆగస్టు 9వ తేదీ ఉదయం 6 గంటల నుంచి ఆగస్టు 10వ తేదీ మధ్యాహ్నం 12గంటల వరకు మళ్లింపులు ఉంటాయని ట్రాఫిక్ పోలీసులు తెలిపారు. బస్సులు, భారీ వాహనాలు అంబర్‌పేట్ ÷÷-లఓల్గ÷వర్ మీదుగా వెళ్లాలని సూచించారు. చిలకలగూడ కట్ట మైసమ్మ ఆలయం వద్ద ఆగస్టు 9, 10వ తేదీల్లో ఉదయం 5 గంటల నుంచి రాత్రి 11గంటల వరకు ట్రాఫిక్ ఆంక్షలు అమల్లో ఉంటాయని వెల్లడించారు. సీతాఫల్‌మండి, పద్మారావు నగర్ వైపు వాహనాలను మళ్లిస్తున్నట్లు చెప్పారు. వాహనదారులు ప్రత్యామ్నాయ మార్గాలను ఎంచుకోవాలని ట్రాఫిక్ పోలీసులు విజ్ఞప్తి చేశారు.

# ఎల్‌నినోతో సాగునీటికి కష్టాలు


(మొదటి పేజీ తరువాయి)

రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ఒకవేళ నాగార్జునసాగర్ నిండినప్పటికీ చెరువులు నింపే పరిస్థితి లేదని, ఇప్పటికే బోర్లలో కూడా గ్రౌండ్ వాటర్ తగ్గిపోతున్నందున కష్టకాలంలో అధికారులు, ప్రజాప్రతినిధులు రైతులకు అండగా నిలబడి ఆరుతడి పంటలు వేసుకునేలా చూడాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు. శనివారం నల్గొండ జిల్లా కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన జిల్లా సాగునీటి సలహా మండలి సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన మంత్రి మాట్లాడుతూ.. ప్రస్తుతం నాగార్జునసాగర్ ప్రాజెక్టులో నీరు డెడ్‌స్టోరేజీలో ఉందని, శ్రీశైలం నుంచి నీరు వచ్చినప్పటికీ పంటలకు సాగునీరు ఇచ్చే పరిస్థితి లేదని, ఉన్న నీరు జూన్ 2027 వరకు తాగునీటికే సరిపోతుందని తెలిపారు. వీటన్నింటినీ దృష్టిలో ఉంచుకొని రైతులు ఆరుతడి పంటలు వేసుకోవాలని కోరారు. ఏఎంఆర్‌పీ కూడా సగమే నిండిందని, గతంలో ఎప్పుడూ ఇలాంటి పరిస్థితి లేదని మంత్రి అన్నారు.కరువు వచ్చినప్పటికీ నల్గొండ జిల్లాకు శాశ్వతంగా సాగునీరు అందించే ఎస్ఎల్‌బీసీ సొరంగం పనులు ఆగస్టు 2028 నాటికి పూర్తి చేస్తామని మంత్రి తెలిపారు. పనులు కొనసాగుతున్నాయని, ఏఎంఆర్‌పీ, ఎస్ఎల్‌బీసీ, బ్రాహ్మణ వె÷-లలెంల ద్వారా జిల్లాలో నాలుగు లక్షల ఎకరాలకు సాగునీరు అందుతుందని అన్నారు. ఎస్ఎల్‌బీసీ కోసం ఎంతైనా ఖర్చు చేయాలని రాష్ట్ర ముఖ్యమంత్రి ఆదేశించారని తెలిపారు. కరువు వచ్చినా, శ్రీశైలం డెడ్‌స్టోరేజీలో ఉన్నప్పటికీ ఎస్ఎల్‌బీసీ నుంచి సాగునీరు అందించవచ్చన్నారు. రాబోయే రోజుల్లో సూపర్ ఎల్‌నినో కారణంగా దక్షిణ తెలంగాణలో పరిస్థితులు ఎలా ఉంటాయో తెలియని పరిస్థితి నెలకొందని తెలిపారు. అందువల్ల అధికారులు, ప్రజాప్రతినిధులు రైతులు ఆరుతడి పంటలు వేసుకునేలా కష్టపడి పనిచేయాలని, ఇలాంటి కరువు పరిస్థితుల్లో రైతులకు అందరూ అండగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. జిల్లాలో పంట మార్పిడిలో భాగంగా 33 వేల ఎకరాల్లో వరికి బదులు ఆరుతడి పంటలు వేయడం జరిగిందని మంత్రి తెలిపారు. అయితే దీన్ని లక్షన్నర ఎకరాల లక్ష్యంగా తీసుకుని రైతులతో ఆరుతడి పంటలు వేయించాలని ఆదేశించారు. జిల్లాలో 9 వేల ట్రాన్స్‌ఫార్మర్లపై ఉన్న ఓవర్‌లోడ్‌ను దృష్టిలో ఉంచుకొని రాష్ట్ర ముఖ్యమంత్రితో మాట్లాడి అవసరమైన విద్యుత్ సామగ్రిని తెప్పిస్తామన్నారు. అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి కష్టకాలంలో రైతులకు అండగా ఉండాలని, ప్రజలకు ధైర్యం చెప్పాలని, ఆరుతడి పంటలు వేసుకునే విధంగా రైతులకు అవగాహన కల్పించాలన్నారు. ఇకపై జిల్లా సాగునీటి సలహా మండలి సమావేశాలను నిరంతరం నిర్వహించాలని సూచించారు.

# హైడ్రాలో 150 డ్రైవర్ ఉద్యోగాలు

**• వేలదిగా తరలివచ్చిన నిరుద్యోగులు**

**• సరూర్ నగర్ స్టేడియంలో తోపులాట**




**తొలి అక్షరం/హైదరాబాద్,ఆగస్టు 08:** నగరంలోని సరూర్‌నగర్ స్టేడియం వద్ద తోపులాట జరిగింది. హైడ్రాలో 150 డ్రైవర్ ఉద్యోగాల కోసం నిరుద్యోగులు పోటెత్తారు. శనివారం, ఆదివారం డ్రైవర్ల ఎంపిక ఉంటుందని హైడ్రా ప్రకటించింది. దీంతో ఇందులో పాల్గొనేందుకు నిరుద్యోగులు భారీగా తరలిరావడంతో తోపులాట జరిగింది. ఇటీవల హైడ్రా విడుదల చేసిన 150 డ్రైవర్ పోస్టుల భర్తీ కోసం నిర్వహించిన రిక్రూట్‌మెంట్ పక్రియ తీవ్ర గందగోళానికి దారి తీసింది. డ్రైవర్ పోస్టల కోసం రాష్ట్రంలోని నలుమూల నుంచి వేలాది మంది నిరుద్యోగ యువత శనివారం తెల్లవారుజామున 4 గంటల నుంచే భారీగా సరూర్‌నగర్ స్టేడియానికి చేరుకున్నారు. కేవలం 150 పోస్టులు ఉండగా.. ఊహించిన రీతిలో వేలాది మంది పోటెత్తడంతో స్టేడియం మొత్తం నిరుద్యోగులతో కిక్కిరిసిపోయింది. ఈ క్రమంలో కొంత ఉద్రిక్తత, తోపులాట చోటుచేసుకుంది. గంటల తరబడి లైన్లలో వేచి ఉన్నప్పటికీ అధికారుల వైపు నుంచి సరైన ఏర్పాట్లు లేకపోవడంతో నిరుద్యోగులు అసహనం వ్యక్తం చేశారు. కనీసం తాగడానికి మంచి నీరు కూడా ఏర్పాటు చేయకపోవడంతో లైన్లలో వేచి ఉన్న యువత.. నిర్వాహకుల తీరుపై ఆందోళనకు దిగారు. ఉద్యోగం కోసం జిల్లాలు దాటి వస్తే అధికారులు నిర్లక్ష్యంగా ప్రవర్తించారంటూ నిరుద్యోగులు వాపోతున్నారు. వెంటనే స్థానిక పోలీసులు అక్కడకు చేరుకుని పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు. ప్రస్తుతం అభ్యర్థులకు టోకెన్ ఇచ్చి వెనక్కి పంపిస్తున్నట్లు తెలుస్తోంది. టోకెన్‌లో చెప్పిన టైమ్ ప్రకారం అక్కడకు వచ్చి ఈవెంట్స్‌లో పాల్గొనాలని నిర్వాహకులు చెబుతున్నారు.

# నిత్యవసర వస్తువుల ధరలు తగ్గించడంలోకేంద్ర ప్రభుత్వం వైఫల్యం

**• బంధు మహేందర్ సిపిఐ తొర్రూరు మండల కార్యదర్శి**



**తొలి అక్షరం/రాష్ట్ర బ్యూరో తొర్రూర్ ప్రతినిధి (సాంబ పస్తం) ఆగస్టు 8:** వంద రోజులలో ధరలు తగ్గిస్తామని ప్రగాల్బాలు పలికిన కేంద్ర బిజెపి ప్రభుత్వం నిత్యావసర వస్తువుల ధరలు తగ్గించడంలో పూర్తిగా వైఫల్యం చెందిందని సిపిఐ తొర్రూరు మండల కార్యదర్శి బందు మహేందర్ విమర్శించారు కురవి మండల కేంద్రం పార్టీ కార్యాలయంలో మార్పు కావాలి అనే నినాదంతో కేంద్ర బిజెపి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక పాలన నిరసిస్తూ 6 నుంచి 14 వరకు జరిగే పాదయాత్ర ప్రచార జాత గోడపత్రికలను అవిష్కరించిన సందర్భంగా బందు మహేందర్ మాట్లాడుతూ రైతులు పండించిన పంటలకు మద్దతు ధర కల్పించక పోవడం,యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడంలో,అసంఘటితరంగ కార్మికులకు పని భద్రత లేక, యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడంలో పూర్తిగా వైఫల్యం చెంది న మోడీ ప్రభుత్వం, ప్రజల భావోద్వేగాలను రెచ్చగొడుతు,విభజన,విద్వేషరాజకీయాలతో భారత రాజ్యాశీగ మూల సూత్రాలకు తిలోదకాలు ఇచ్చే ప్రజా వ్యతిరేక పాలనపై ప్రజా ఉద్యమాలతోనే బుద్ధి చెప్పాలని కోరారు మార్పు కావాలి అనే నినాదంతో సిపిఐ చేపట్టిన సెప్టెంబర్ 1న చలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు ఈ కార్యక్రమంలో సిపిఐ తొర్రూరు మండల సహాయ కార్యదర్శిలు పేరబోయిన కిరణ్ కుమార్, ఘనపురం లక్ష్మణ్, పట్టణ కార్యదర్శి ముద్రబోయిన వెంకన్న, అమ్మపురం గ్రామ శాఖ కార్యదర్శి బూరుగు యాదగిరి, కంటయపాలెం గ్రామ శాఖ కార్యదర్శి మందపురి శ్యామ్, హరిపిరాల గ్రామ శాఖ కార్యదర్శి వల్ల వెంకన్న, జీకే తండా అజ్మీర వీరన్న, పసుల యాకయ్య పాల్గొన్నారు

# ప్రజా సేవకు ఝాన్సీ రాజేందర్ రెడ్డి జీవితం ఆదర్శప్రాయం

**• తొర్రూరు మున్సిపల్ చైర్మన్ తూనం శ్రావణ్ కుమార్**

**తొలి అక్షరం/రాష్ట్ర బ్యూరో తొర్రూర్ ప్రతినిధి (సాంబ పస్తం) ఆగస్టు 8:** ప్రజా సేవకు అంకితమైన హనుమాండ్ల ఝాన్సీ రాజేందర్ రెడ్డి జీవితం ఆదర్శప్రాయమని తొర్రూరు మున్సిపల్ చైర్మన్ తూనం శ్రావణ్ కుమార్ అన్నారు. టిపిసిసి ఉపాధ్యక్షురాలు, కాంగ్రెస్ పార్టీ పాలకుర్తి నియోజకవర్గ ఇంచార్జ్, వేట వ్యవస్థాపకురాలు హనుమాండ్ల ఝాన్సీ రాజేందర్ రెడ్డి వివాహ వార్షికోత్సవ వేడుకలను కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మోత్కూరి రవీంద్ర చారి,పట్టణ అధ్యక్షుడు ముద్దసాని సురేష్ ల ఆధ్వర్యంలో శనివారం తొర్రూర్ డివిజన్ కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా చైర్మన్ శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ మూడు దశాబ్దాల కాలంగా నియోజకవర్గ వ్యాప్తంగా ఝాన్సీ రాజేందర్



రెడ్డి దంపతులు అనేక సేవా కార్యక్రమాలు చేపట్టి ప్రజల మన్ననలు పొందారని గుర్తు చేశారు. వారి సేవలను గుర్తించిన పాలకుర్తి నియోజకవర్గం ప్రజలు వారి కుటుంబానికి ఎమ్మెల్యే పదవిని అప్పగించారని అన్నారు. ఝాన్సీ రెడ్డి దిశా నిర్దేశంలో ఎమ్మెల్యే యశస్విని రెడ్డి నాయకత్వంలో పాలకుర్తి నియోజకవర్గం అన్ని విధాల అభివృద్ధి చెందుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. రానున్న రోజుల్లో ఝాన్సీ రాజేందర్ రెడ్డి ఆయురారోగ్యాలతో, ప్రజాసేవలో ఉండి రాణించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి వెంకన్న యాదవ్,కాంగ్రెస్ పార్టీ నాయకులు డాక్టర్ పొనుగోటి సోమేశ్వరరావు,గంజి విజయపాల్ రెడ్డి,మంగళపల్లి రామచంద్రయ్య,జీనుగా సురేందర్ రెడ్డి,జక్కా మహబూబ్ రెడ్డి,చింతకుంట్ల శ్రీనివాస్ రెడ్డి,చిత్తలూరి శ్రీనివాస్, జక్కుల రాం రెడ్డి, అచ్చిరెడ్డి, వెంకటాచారి, సురేందర్ రాజు,ఇంద్రసేనా రెడ్డి,శ్యాంసుందర్ రెడ్డి, భూసాని రాము,గంజి దేవేందర్ రెడ్డి,దొంగరి శంకర్,వెంకట్ రెడ్డి,పింగిలి ఉష, ప్రవీణ్ యాదవ్,దీకొండ మధు, నల్లపు రాజు,తూర్పాటి రాంబాబు, పంజా కల్పన, బిజ్జాల అనిల్,అశోక్ రెడ్డి,వెలుగు మహేశ్వరి, అనిత, యశోద, చిదిరాల రవి,లక్ష్మణ్, సంపత్, రమేష్ నాయక్, సురేష్, శోభ,ఎర్రం రాజు, చంటి పాల్గొన్నారు.

# సిద్ధార్థ హై స్కూల్‌లో గోరింటాకు సంబరాలు




**తొలి అక్షరం/రాష్ట్ర బ్యూరో తొర్రూర్ ప్రతినిధి (సాంబ పస్తం) ఆగస్టు 8:** తొర్రూర్ సిద్ధార్థ హై స్కూల్ లో గోరింటాకు సంబరాలు ఘనంగా నిర్వహించారు.మహిళా ఉపాధ్యాయులు, విద్యార్థులు ఒక్కచోట చేరి గోరింటాకు రుబ్బి ఒకరి చేతికి ఒకరు పెట్టుకుని మురిసిపోయారు.ఆరోగ్యం, ఆచారం కలగలిపిన గోరింటాకు వేడుకల్లో బాలికలు, మహిళా ఉపాధ్యాయులు ఉత్సాహంగా పాల్గొన్నారు.పాటలు పాడుతూ సందడిగా గడిపారు.ఈ సందర్భంగా పాఠశాల చైర్మన్ ముత్తినేని సోమేశ్వరరావు, కరస్పాండెంట్ ముత్తినేని జయప్రకాష్ లు మాట్లాడుతూ....ఆషాఢ మాసంలో మహిళలు గోరింటాకు సంబరాలను అత్యంత ఉత్సాహంగా, వేడుకలా జరుపుకుంటారని, ఇది కేవలం అందం మాత్రమే కాకుండా ఆరోగయానికి, సాంప్రదాయానికి ప్రతీక అని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# సమాచార హక్కు చట్టం సాధన కమిటీ చౌటుప్పల్ మండల ఉపాధ్యక్షుడిగా సుర్కంటి శ్రీనివాస్ రెడ్డి

**తొలి అక్షరం/చౌటుప్పల్, ఆగస్టు 08:** సమాచార హక్కు చట్టం (RTI) సాధన కమిటీ యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండల ఉపాధ్యక్షుడిగా దేవలమ్మ నాగారం గ్రామానికి చెందిన సుర్కంటి శ్రీనివాస్ రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ మేరకు శనివారం సమాచార హక్కు చట్టం సాధన కమిటీ జాతీయ ప్రధాన కార్యదర్శి మల్లం వెంకటేష్ ఆయనను మండల ఉపాధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన మండల ఉపాధ్యక్షుడు సుర్కంటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి మండల ఉపాధ్యక్షుడిగా బాధ్యతలు అప్పగించిన సమాచార హక్కు చట్టం సాధన కమిటీ జాతీయ ప్రధాన కార్యదర్శి మల్లం వెంకటేష్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అదేవిధంగా కమిటీ చైర్మన్ డాక్టర్ చంటి ముదిరాజ్ రాఖీకి కూడా ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. సమాచార హక్కు చట్టం ద్వారా ప్రజలకు ప్రభుత్వ పాలనలో పారదర్శకత, జవాబుదారీతనం గురించి అవగాహన కల్పించేందుకు కృషి చేస్తానని శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ప్రజలకు అందుబాటులో ఉండి, సమాచార హక్కు చట్టం ద్వారా తమ సమస్యలకు పరిష్కారం పొందే విధంగా అవసరమైన అవగాహన కల్పించడమే తన ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రజలకు అందుబాటులో ఉన్న సమాచారాన్ని చట్టబద్ధంగా పొందే హక్కుపై ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. సమాచార హక్కు చట్టం ప్రాధాన్యతను గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు వివరించి, చట్టాన్ని సద్వినియోగం చేసుకునేలా ప్రజలను చైతన్యపరచేందుకు కమిటీ తరఫున విస్తృతంగా కార్యక్రమాలు నిర్వహించేందుకు కృషి చేస్తానని తెలిపారు. తనకు అప్పగించిన మండల ఉపాధ్యక్ష పదవికి పూర్తి న్యాయం చేస్తూ కమిటీ నిర్దేశించిన లక్ష్యాల సాధన కోసం శక్తివంచన లేకుండా పనిచేస్తానని సుర్కంటి శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు. సమాచార హక్కు చట్టం సాధనతో పాటు ప్రజా సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లడంలో తన వంతు బాధ్యతను సమర్థవంతంగా నిర్వర్తిస్తానని తెలిపారు. ఈ సందర్భంగా పలువురు కమిటీ సభ్యులు, నాయకులు సుర్కంటి శ్రీనివాస్ రెడ్డికి అభినందనలు తెలియజేసి, ఆయన నాయకత్వంలో చౌటుప్పల్ మండలంలో సమాచార హక్కు చట్టంపై మరింత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆకాంక్షించారు.



# మహబూబాబాద్ జిల్లా ఉపసర్పంచ్‌ల సంఘ ఉపాధ్యక్షులుగా ఎర్రగొర్ల రమేష్





**పెద్దవంగర ఆగష్టు 8 తొలి అక్షరం:** పాలకుర్తి నియోజకవర్గం శాసనసభ్యురాలు మామిడాల యశస్విని రెడ్డి టీపీసీసీ ఉపాధ్యక్షురాలు, హనుమాశీడ్ల ఝాన్సీ రాజేందర్ రెడ్డి ఆశీర్వాదంతో, తెలంగాణ రాష్ట్ర ఉప సర్పంచ్ ల సంఘం వ్యవస్థాపకులు ఎల్ రాములు నాయక్ తెలంగాణ ఉప సర్పంచ్ ల సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎస్ గోపాల్ ఆధ్వర్యంలో ఉమ్మడి వరంగల్ జిల్లా మాజీ జడ్పీ ఫ్లోర్ లీడర్ నెమరుగొమ్ముల ప్రవీణ్ రావు సహకారంతో మహబూబాబాద్ జిల్లా ఉప సర్పంచుల సంఘము ఉపాధ్యక్షులుగా ఎర్రగొర్ల రమేష్ నియమించడం జరిగింది. తనపై నమ్మకంతో నాకు ఈ బాధ్యతను అప్పగించినందుకు ఎర్రగొర్ల రమేష్ మాట్లాడుతూ నన్ను ఎన్నుకున్న నాయకులకు ప్రజలకు నేను రుణపడి ఉంటానని నా కర్తవ్యముగా పనిచేస్తానని తెలియచేస్తూ హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు.

## అదుపుతప్పిన ఆర్టీసీ ఎలక్ట్రిక్ బస్సు.. తప్పిన పెను ప్రమాదం




**తొలి అక్షరం/మహాదేవపూర్ ఆగస్టు 8:** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండలంలో ఆర్టీసీ ఎలక్ట్రిక్ బస్సు అదుపుతప్పి రహదారి పక్కనున్న చెట్లలోకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో ప్రయాణికులు సురక్షితంగా బయటపడటంతో పెను ప్రమాదం తప్పింది. వరంగల్ నుంచి కాళేశ్వరం వైపు వెళు న్న ఆర్టీసీ ఎలక్ట్రిక్ బస్సు మహాదేవపూర్‌లోని అయ్యప్పస్వామి ఆలయం సమీపంలోకి రాగానే అదుపుతప్పి రహదారి పక్కకు దూసుకెళ్లి చెట్లలోకి వెళ్లింది. బస్సులో సుమారు 20 మంది ప్రయాణికులు ఉన్నట్లు సమాచారం. బస్సు అదుపుతప్పడానికి సాంకేతిక సమస్య కారణమై ఉండొచ్చని తెలుస్తోంది. అయితే ఈ ఘటనలో ప్రయాణికులకు ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. ఘటనపై సంబంధిత అధికారులు వివరాలు సేకరిస్తున్నారు.

# అభివృద్ధికి ఆమడ దూరంలో దళితవాడలు

**స్వాతంత్ర్యం వచ్చి 78 ఏళ్లు**
**గడిచినా మారని దుస్థితి**
**తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం**

**తొలి అక్షరం/చౌటుప్పల్, ఆగస్టు 08:** స్వాతంత్ర్యం వచ్చి 78 సంవత్సరాలు గడిచినా దళితులు, దళితవాడలు నేటికీ అభివృద్ధికి ఆమడ దూరంలోనే ఉన్నాయని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు జల్లెల పెంటయ్య, ప్రధాన కార్యదర్శి కొండమడుగు నర్సింహ ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం చౌటుప్పల్ మండల పరిధిలోని మసీదుగూడెం గ్రామంలోని దళితవాడల్లో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామంలో సుమారు 25 దళిత కుటుంబాలు నివసిస్తుండగా, కేవలం ఐదు కుటుంబాలకు మాత్రమే స్లాబ్ ఇళ్లు ఉన్నాయని, మిగతా కుటుంబాలు పెంకుటిళ్లు, రేకుల ఇళ్లలోనే జీవనం సాగిస్తూ అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. అర్హులైన ప్రతి నిరుపేద దళిత కుటుంబానికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసి పక్కా గృహాలు నిర్మించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అదేవిధంగా గ్రామంలోని ఐదు దళిత కుటుంబాలకు కనీసం సెంటు భూమి కూడా లేదని, మిగతా కుటుంబాలకు కూడా ఎకరంలోపు మాత్రమే భూమి ఉందని తెలిపారు. భూమిలేని దళిత కుటుంబాలకు భూమి అందించడంతో పాటు, ప్రతి దళిత కుటుంబానికి మూడు ఎకరాల భూమి అందించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు.

**మురుగు కాలువలు లేక ప్రజల అవస్థలు**

దళితవాడల్లో మురుగు కాలువల వ్యవస్థ సక్రమంగా లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని నాయకులు పేర్కొన్నారు. ఇప్పటికే ఉన్న మురుగు కాలువలు కూడా అస్తవ్యస్తంగా ఉండటంతో మురుగు నీరు నిలిచిపోయి దోమల బెడద, దుర్వాసనతో ప్రజలు అవస్థలు పడుతున్నారని తెలిపారు. దీంతో వివిధ అనారోగ్య సమస్యలు తలెత్తే పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం







చేశారు. వెంటనే అధికారులు దళితవాడలను పరిశీలించి, అవసరమైన చోట కొత్త మురుగు కాలువలు నిర్మించాలని, పాడైన కాలువలకు మరమ్మతులు చేపట్టాలని డిమాండ్ చేశారు.

**విద్య, వైద్యం, ఉపాధి అందని ద్రాక్షే**

నేటికీ దళిత, నిరుపేద కుటుంబాలకు నాణ్యమైన విద్య, వైద్యం, ఉపాధి అందని ద్రాక్షగానే మిగిలాయని వారు అన్నారు. పేద విద్యార్థులకు ఉచిత విద్య, నిరుపేద కుటుంబాలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టాలని కోరారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలను పెంచి పేద కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించాలని సూచించారు. దళితుల అభ్యున్నతి కోసం ఉద్దేశించిన సబ్‌ప్లాన్ నిధులు, ప్రత్యేక నిధులను సమర్థవంతంగా వినియోగించి, జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని దళితవాడల్లో మౌలిక వసతులు కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రోడ్లు, డ్రైనేజీ, తాగునీరు, విద్యుత్, ఇళ్లు తదితర మౌలిక సదుపాయాలు కల్పించి దళితవాడలను సమగ్రంగా అభివృద్ధి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు గంగాదేవి సైదులు, మండల అధ్యక్ష, కార్యదర్శులు యాట బాలరాజు, చింతల సుదర్శన్, జిల్లా కమిటీ సభ్యులు మానే సాలయ్య, మండల కమిటీ సభ్యులు సంజీవ్, రమేష్తో పాటు గ్రామ ప్రజలు చెక్క లింగస్వామి, రేణుక, శంకర్, నాగమ్మ, సురేష్, నాగలక్ష్మి, బక్క సురేష్, బాబు, సుజాత, రోనయ్య, యాదమ్మ, మల్లయ్య, అండాలు, పార్వతమ్మ తదితరులు పాల్గొన్నారు.

# కాళేశ్వరంలో ఎమ్మార్పీఎస్ నూతన కమిటీ ఏకగ్రీవం

**తొలి అక్షరం/మహాదేవపూర్ ఆగస్టు 8:** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం కాళేశ్వరం గ్రామంలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ నూతన గ్రామ కమిటీలను శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పద్మశ్రీ మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ సమావేశం కాళేశ్వరం హరిత హోటల్‌లో ఎమ్మార్పీఎస్ మాజీ మండల అధ్యక్షుడు బెల్లంపల్లి సురేష్ మాదిగ ఆధ్వర్యంలో జరిగింది. ఈ సమావేశానికి ఎమ్మార్పీఎస్ భూపాలపల్లి జిల్లా ఇన్‌చార్జి మడిపల్లి శ్యాంబాబు మాదిగ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమాజంలో మత దురహంకారం, కుల వివక్ష, సామాజిక అసమానతలు లేకుండా సమసమాజ నిర్మాణం కోసం ఎమ్మార్పీఎస్ నిరంతరం కృషి చేస్తోందన్నారు. పద్మశ్రీ మందకృష్ణ మాదిగ నాయకత్వంలో పేద కుటుంబాలకు, అణగారిన వర్గాలకు న్యాయం జరిగేలా అనేక పోరాటాలు నిర్వహించామని తెలిపారు. అన్ని వర్గాల్లోని పేదల



సామాజిక, ఆర్థిక అభివృద్ధికి కృషి చేయడమే ఎమ్మార్పీఎస్ ప్రధాన లక్ష్యమని శ్యాంబాబు మాదిగ పేర్కొన్నారు. మహాత్మా జ్యోతిరావు పూలే, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్, బాబు జగ్జీవన్‌రామ్, భాగ్యరెడ్డి వర్మ తదితర మహనీయుల ఆశయాలు, సామాజిక న్యాయ వారసత్వాన్ని ముందుకు తీసుకెళ్లేందుకు ఉద్యమాన్ని మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. రాబోయే రోజుల్లో సామాజిక, ఆర్థిక అసమానతలపై మరో దశ పోరాటానికి మాదిగలు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. సామాజిక ఉద్యమానికి దిక్సూచిగా నిలిచే విధంగా గ్రామస్థాయి నుంచి ఉద్యమ నిర్మాణాన్ని పటిష్టం చేయాలని సూచించారు. **నూతన కమిటీ వివరాలు**కాళేశ్వరం ఎమ్మార్పీఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడిగా లేతకారి అవినాష్, ఉపాధ్యక్షుడిగా లేతకారి భాస్కర్, ప్రధాన కార్యదర్శిగా లేతకారి రాజశేఖర్లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అలాగే ఎంఎస్పీ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడిగా లేతకారి రాజబాబును నియమించారు. నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులు గ్రామంలో ఎమ్మార్పీఎస్ ఉద్యమాన్ని బలోపేతం చేస్తూ, సామాజిక న్యాయం, సమానత్వం కోసం కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మాజీ మండల అధ్యక్షుడు బెల్లంపల్లి సురేష్ మాదిగ, చింతకుంట్ల సదానందం, లేతకారి రాజయ్య, లేతకారి రాజు, సమ్మయ్యతో పాటు గ్రామ నాయకులు, పెద్దలు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# టీసీలు, బోనఫైడ్లు ఇవ్వడం లేదని ఆందోళన


## ● శాస్త్ర స్కూల్ మేనేజ్‌మెంట్‌పై బీజేవైఎం , ఏబీవీపీ నాయకుల ఆరోపణలు



**తొలి అక్షరం/షాద్ నగర్, ఆగస్టు 08:** షాద్‌నగర్‌లోని శాస్త్ర స్కూల్‌లో విద్యార్థులకు టీసీలు, బోనఫైడ్లు ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారని బీజేవైఎం అసెంబ్లీ కన్వీనర్ పుట్నాల సాయికుమార్ ఆరోపించారు. విద్యార్థుల తల్లిదండ్రులు పాఠశాల మేనేజ్‌మెంట్‌ను సంప్రదించగా, రికార్డులు తమ వద్ద లేవని, గత మేనేజ్‌మెంట్‌ను సంప్రదించాలని చెబుతున్నారని పేర్కొన్నారు. విద్యార్థుల భవిష్యత్తుకు సంబంధించిన ధ్రువపత్రాల విషయంలో మేనేజ్‌మెంట్ నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరికాదని సాయికుమార్ అన్నారు. విద్యార్థుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ బీజేవైఎం, ఏబీవీపీ నాయకులు పాఠశాల వద్ద ఆందోళన చేపట్టారు. ఈ విషయాన్ని ఎంఈఓ మనోహర్ దృష్టికి తీసుకెళ్లగా, ఆయన స్పందించి పాఠశాలకు చేరుకుని మేనేజ్‌మెంట్‌తో మాట్లాడారు. సమస్యను వెంటనే పరిష్కరించకపోతే పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని సాయికుమార్ హెచ్చరించారు. కార్యక్రమంలో వివేక్, అభి, ఏబీవీపీ నాయకులు విజయ్, కోమల్, రాహుల్, ప్రశాంత్, జస్వంత్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఇనుగుర్తి... రాళ్లలో రాసిన రహస్య చరిత్ర

ఊరు అంటే ఇళ్లు మాత్రమే కాదు...
ఊరు అంటే మనుషులు మాత్రమే కాదు...
కాలం తన అడుగులను దాచుకున్న చోటు...
చరిత్ర తన ఊపిరిని పీల్చుకున్న నేల...
అదే ఇనుగుర్తి!
ఈ మట్టిని తడిమితే
చరిత్ర చేతివేళ్లు తగులుతాయి...
ఈ రాళ్లను పరిశీలిస్తే
వేల ఏళ్ల నాటి చరిత్రను మనతో పంచుకుంటుంది ...
నిటారుగా,నిశ్శబ్దంగా నిలిచిన రాతిస్తంభం
ఎన్ని వెట్టి చేతులతో నిలబెట్టబడిందో
ఎన్ని రాచరిక పాలనలు చూసిందో
ఎన్ని యుద్ధోన్మాదాలకు మౌన సాక్షిగా నిలిచిందో
ఎవరికీ తెలియదు...
గాలికి ఊగని నంది విగ్రహం
ఎన్ని తరాల భక్తిని ఆస్వాదించిందో
ఎందరి బాల శివుల్ని మోసిందో ఎవరికీ తెలియదు...
నతవాడీ రాజుల అడుగుజాడలు
ఇప్పటికీ ఈ నేల గుండెల్లో ఉన్నాయి...
రాజులు వెళ్లిపోయారు...
రాచరికాలు కనుమరుగయ్యాయి
కోటలు పేటలు బీటలువారి కాలగర్భంలో కలిసిపోయాయి...
నేటి సజీవ సాక్ష్యాలుగా శిల్పాలు నిలిచాయి
వాటికి జీవం ఉట్టిపడే రూపు దిద్ది
ననాటి శిల్పకారుల కళానైపుణ్యం
దర్శనం ఇస్తూ
ఇప్పటికీ ఇనుగుర్తి వీధుల్లో
చరిత్రకు కాపలాగా నిలిచాయి!
గుంటి చెరువు నీళ్లలో
కేవలం నీలాకాశమే ప్రతిబింబించదు...
ఓ నాటి రాజుల సాంగత్య ము పొందిన భోగపు వారు వైభోగంతో ఊగిన ఊయల
కూడా కనిపిస్తుంది!
చెరువు మధ్యలోని
రాతి కంభముల ఊయల
గత కాల వైభవ వైచిత్రం
ఆబాల గోపాలులా రాజకుటుంబాల వ్యాహ్యాళికా,... నాట్య కత్తెలైన పరకాంతలతో ఏకాంతమా..
శిల్పుల నైపుణ్యాలకు ఊహాజనిత కు ప్రతిరూపమా?
సమాధానం లేని కొలనులోని
నిటారైన ఊయల
నీలి నీడలు



ఊరి నేలను తవ్వితే
మట్టి లోగిళ్ల జీవం ఉట్టిపడే శైవ వైష్ణవ
దైవ ప్రతిరూపాల
శిల్ప సంపద చిత్రంగా బయట పడుతుంది
ఒకనాడు కాల గర్భంలో కలిసిన శిల్పం మనతో నేడు మౌనంగా మాట్లాడుతాయి
1952లో తవ్వకాల వేళ
బయటపడిన ఆ రాతి ఆనవాళ్లు
"మమ్మల్ని మర్చిపోవద్దు"
అని కాలాన్ని హెచ్చరించినట్టున్నాయి!
నంది,నాగేంద్రుడు యాదవ రాజుల నిలువెత్తు విగ్రహాలు...
కోవెలలలో ఉన్న మూల విరాట్లు మౌనం దరిస్తే అక్కడి శిలాశాసనాలు మనతో మాట్లాడుతాయి
వాటిని చూసే ప్రతి కంటికీ
ఒకే ప్రశ్న
ఇంతటి చరిత్ర ఉన్న ఊరు
ఇంతకాలం ఎందుకు మౌనంగా ఉంది
1415 సంవత్సరం...
కాలం వెనక్కి తిరిగినట్టుగా
ఆ అక్షరాలు ఇప్పటికీ చెబుతున్నాయి
"ఇక్కడ భక్తి ఉంది...
ఇక్కడ జీవం ఉట్టిపడే శిల్పసంపద,
నిర్మాణ కళా కౌశలం ఉంది
ఇక్కడ మనిషి తన కాలాన్ని,జీవన చిత్రాన్ని రాతిలో రాతితోనే రాసుకున్నట్లు ఉంది
రాజుల పేర్లు మసకబారవచ్చు...
శాసనాల అక్షరాలు చెరిగిపోవచ్చు...
రాతి శిల్పాలకు కాలం గాట్లు పెట్టవచ్చు...
కానీ
ఇనుగుర్తి చారిత్రక శిల్ప కళా వైభవం మాత్రం చెరిగిపోదు!
ఎందుకంటే...
ఇక్కడ ప్రతి చెరువు
ఓ చరిత్ర పుట...
ప్రతి గుడి
ఓ పురాతన అధ్యాయం...
ప్రతి రాతిస్తంభం
ఓ నిశ్శబ్ద శాసనం...
ప్రతి శిల్పం
జీవం ఉట్టి పడే
మౌన కథ...



ప్రతి మట్టి రేణువు
ఓ పూర్వీకుడి జ్ఞాపకం!
ఒకప్పుడు రాజుల అడుగులు పడిన నేల...
తరువాత రైతు అడుగులతో పచ్చబడిన నేల...
ఈరోజు తరాల కలలకు ఊపిరినిస్తున్న నేల...
ఇది కేవలం ఇనుగుర్తి కాదు...
ఇనుగుర్తి తన చారిత్రక కాల జ్ఞాపకాలను తనకు తానుగా ఒడిలో
దాచుకున్న
ఓ తరాల మానవ కళా సంపదల గ్రంథం!
చరిత్ర పుస్తకాల్లో
కొన్ని పేజీలు మాత్రమే కనిపిస్తాయి...
కానీ ఇనుగుర్తిలో
పుస్తకం మొత్తం కనిపించదు...
పుస్తకమే కనిపిస్తుంది!
రాతిలో...
చెరువులో...
గుడిలో...
గాలిలో...
మట్టిలో...
ఎవరూ అడగని ప్రశ్నలకు
ఎవరూ చదవని సమాధానాలు దాచుకుని...
నిశ్శబ్దంగా నిలబడి
తన కథను తానే చెప్పుకుంటున్న ఊరు
ఇనుగుర్తి...
నిన్నటి చరిత్ర కాదు...
నేటికీ బతికే చరిత్ర!

– తాదూరి సంపత్
సీనియర్ జర్నలిస్ట్



# గిరాయి గుట్ట తండాలో దోమల నివారణకు మందు పిచికారి

## ప్రజల ఆరోగ్యమే లక్ష్యంగా దోమల నివారణ చర్యలు: సర్పంచ్ కృష్ణవేణి హరి నాయక్



**తొలి అక్షరం/షాద్ నగర్, ఆగస్టు08:** వర్షాకాలంలో దోమలు, ఈగల వ్యాప్తిని అరికట్టి ప్రజల ఆరోగ్యాన్ని కాపాడే ఉద్దేశంతో ఫరూఖ్‌నగర్ మండలం గిరాయి గుట్ట తండాలో దోమల నివారణ మందును పిచికారి చేశారు. సర్పంచ్ కృష్ణవేణి హరి నాయక్ ఆధ్వర్యంలో తండాలోని వీధులు, రోడ్ల వెంట నిలిచిన నీటి ప్రాంతాల్లో మందు పిచికారి చేపట్టారు. నిల్వ నీటి కారణంగా దోమలు, ఈగలు వృద్ధి చెంది ప్రజలు అనారోగ్యానికి గురయ్యే అవకాశం ఉన్నందున ముందస్తు చర్యలు చేపట్టినట్లు సర్పంచ్ తెలిపారు. ప్రజలు పరిసరాలను పరిశు భ్రంగా ఉంచుకోవడంతో పాటు ఇళ్ల చుట్టూ నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. "ఆరోగ్యమే మహాభాగ్యం" అని పేర్కొన్నారు.

# ఏ బూసి సాయిలు మృతి చాలా బాధాకరం

## ● కుటుంబ సభ్యులకు ఆర్థిక సహాయం అందించిన

## కందిమల్ల గోపాల్ రెడ్డి సర్పంచ్ నిర్నంల





రామన్నపేట మండలం నీర్నంల గ్రామానికి చెందినఏ బూసి సాయిలు మృతి చెందిన విషయాన్ని తెలుసుకున్న గ్రామ సర్పంచ్ కందిమల్ల గోపాల్ రెడ్డి సాయిలు మృతదేహానికి పూలమాలవేసి నివాళు లు అర్పించారు అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించి పదివేల రూపాయల ఆర్థిక సహాయం అందించారు. ఈ కార్యక్రమంలో వార్డు మెంబర్ పెరుమాండ్ల నవీన్‌మాజీ వార్డ్ మెంబర్ కాంగ్రెస్ పార్టీ యువజన నాయకులు నోముల ప్రవీణ్ నోముల కృష్ణ ముత్యాల శివకుమార్‌దాసరి నరసింహ నోముల ముఖేష్ చిప్పలపల్లి ముత్తయ్య చిప్పలపల్లి సురేష్ ఏ బూసి చంటి తదితరులు పాల్గొన్నారు

# గీతన్నల చైతన్య యాత్రకు ఘన స్వాగతం

## - గిర్కటి నిరంజన్ గౌడ్ దండు మల్కాపురం గ్రామ సర్పంచ్



**తొలి అక్షరం/చౌటుప్పల్, ఆగస్టు 08:** గీత కార్మికుల సమస్యలు, హక్కులు, ప్రభుత్వ సంక్షేమ పథకాలపై అవగాహన కల్పిస్తూ నిర్వహిస్తున్న గీతన్నల చైతన్య యాత్రకు దండు మల్కాపూర్ గ్రామంలో ఘన స్వాగతం లభించింది. యాత్ర శనివారం గ్రామంలోని శ్రీ ఆందోల్ మైసమ్మ దేవస్థానం వద్దకు చేరుకోగా, గ్రామ సర్పంచ్ గిర్కటి నిరంజన్ గౌడ్ ఆధ్వర్యంలో యాత్రలో పాల్గొన్న నాయకులు, గీత కార్మికులకు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా గీత కార్మికుల సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం మరింత చొరవ చూపాలని, గీత కార్మికుల సంక్షేమం కోసం అమలు చేస్తున్న పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా చర్యలు తీసుకోవాలని నాయకులు కోరారు. గీత కార్మికుల హక్కుల పరిరక్షణ, వారి జీవన ప్రమాణాల మెరుగుదల కోసం నిర్వహిస్తున్న చైతన్య యాత్రకు గౌడ సంఘాలు, గీత కార్మికులు సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర గీత కార్మికుల ఆర్థిక సహకార సంస్థ మాజీ చైర్మన్ పల్లె రవికుమార్, గౌడ సంఘాల నాయకులు, గీత కార్మిక సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు. అలాగే మల్కాపూర్ గౌడ సంఘం అధ్యక్షులు కలగోని శ్రీధర్ గౌడ్, ఉపాధ్యక్షులు, వార్డు సభ్యులు పొట్లపల్లి శివశంకర్ గౌడ్, కల్లు గీత కార్మికుల సంఘం అధ్యక్షులు బుర్ర స్వామి గౌడ్, ఉపాధ్యక్షులు కిషన్, వార్డు సభ్యులు సుంకరి విజయ్‌కుమార్ గౌడ్తో పాటు గౌడ సంఘం సభ్యులు, గీత కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. గీత కార్మికుల సంక్షేమం, హక్కుల పరిరక్షణ కోసం సాగుతున్న గీతన్నల చైతన్య యాత్రకు గ్రామస్థులు, గౌడ సంఘాల నాయకులు, గీత కార్మికులు తమ సంపూర్ణ సంఘీభావం తెలిపారు.



# బంజరుపల్లిలో ముమ్మరంగా సాగుతున్న రోడ్డు విస్తరణ పనులు

- పర్యవేక్షిస్తున్న బంజరపల్లి సర్పంచ్ భూక్య రమేష్ రాథోడ్






**తొలి అక్షరం/నెక్కొండ ఆగస్టు 8:** వరంగల్ జిల్లా నెక్కొండ మండల పరిధిలోని బంజరపల్లి గ్రామంలో నర్సంపేట అభివృద్ధి ప్రదాత ఎమ్మెల్యే దొంతి మాధవ రెడ్డి సహకారంతో గ్రామంలో రోడ్డు విస్తరణ పనులు శరవేగంగా సాగుతున్నాయి.. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ ఎర్ర సుజాత రాజు, కాంగ్రెస్ సీనియర్ పార్టీ నాయకులు వెంకటేశ్వర్లు వార్డ్ మెంబర్లు శ్రీను , సర్వర్ రాజారాం సతీష్ కృష్ణ రాజేందర్ మరియు గ్రామ పెద్దలు పార్టీ పుర ప్రముఖులు గ్రామ పెద్దలందరూ పాల్గొనడం జరిగింది.. బంజరపల్లి సర్పంచ్ సర్పంచుల ఫోరం అధ్యక్షులు రమేష్ రాథోడ్ సర్పంచ్ మాట్లాడుతూ గ్రామ అభివృద్ధికి సహాయ సహకారాలు అందిస్తున్న గ్రామ ప్రజలందరికీ ధన్యవాదాలు తెలియజేయడం జరిగింది..

# నేలపట్ల చేనేత సహకార సంఘం చైర్మన్ ఎన్నికపై స్టే

## తెలంగాణ కో-ఆపరేటివ్ ట్రిబ్యునల్‌ను ఆశ్రయించిన నలుగురు డైరెక్టర్లు

**తొలి అక్షరం/చౌటుప్పల్.ఆగస్టు 08:** చౌటుప్పల్ మండలం నేలపట్ల చేనేత సహకార సంఘం ఇటీవల నిర్వహించిన ఎన్నికల్లో చైర్మన్ ఎన్నికపై వివాదం నెలకొంది. జూలై 10న జరిగిన ఎన్నికల్లో స్థానిక పద్మశాలి కుల సంఘం తరఫున ఒక ప్యానెల్, గతంలో సంఘం అధ్యక్షుడిగా కొనసాగిన పిల్లలమరి శ్రీనివాసు తరఫున మరో ప్యానెల్ పోటీ చేసినట్లు కుల సంఘం ప్రతినిధులు తెలిపారు.ఎన్నికల ఫలితాల్లో పద్మశాలి కుల సంఘం ప్యానెల్ ఆరు డైరెక్టర్ స్థానాలను, పిల్లలమరి శ్రీనివాసు ప్యానెల్ మూడు స్థానాలను గెలుచుకున్నట్లు పేర్కొన్నారు. అనంతరం కుల సంఘం ప్యానెల్‌కు చెందిన ఇద్దరు డైరెక్టర్ల మద్దతుతో పిల్లలమరి శ్రీనివాసు ఐదు ఓట్ల తేడాతో చైర్మన్‌గా ఎన్నికైనట్లు తెలిపారు.అయితే నూతనంగా ఎన్నికైన చైర్మన్‌కు ముగ్గురు పిల్లలు ఉన్నారనే అంశాన్ని ప్రస్తావిస్తూ, సహకార సంఘాల ఎన్నికలకు



సంబంధించిన నిబంధనల ప్రకారం ఆయన డైరెక్టర్‌గా, తద్వారా చైర్మన్‌గా ఎన్నిక కావడంపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ కుల సంఘం ప్యానెల్‌కు చెందిన నలుగురు డైరెక్టర్లు తెలంగాణ కో-ఆపరేటివ్ ట్రిబ్యునల్‌ను ఆశ్రయించినట్లు తెలిపారు.తడక పారిజాత, పిల్లలమరి కిరణ్, గంజి శ్రీనివాసు, తడక కోటేశ్వర్లు కలిసి ఆగస్టు 5న ట్రిబ్యునల్‌ను ఆశ్రయించినట్లు పేర్కొన్నారు. పిటిషన్‌లో పేర్కొన్న అంశాలను పరిశీలించిన అనంతరం ట్రిబ్యునల్ న్యాయమూర్తి నూతనంగా ఎన్నికైన పిల్లలమరి శ్రీనివాసుకు ముగ్గురు పిల్లలు ఉన్నారనే అంశంపై డైరెక్టర్ ఎన్నికతో పాటు చైర్మన్ ఎన్నికకు సంబంధించిన అంశంపై స్టే ఆర్డర్ జారీ చేసినట్లు తెలిపారు.ఈ స్టే ఆర్డర్ ఆగస్టు 5, 2026 నుంచి అమల్లోకి వస్తుందని కోర్టు ఆర్డర్‌లో స్పష్టంగా పేర్కొన్నట్లు కుల సంఘం ప్యానెల్ ప్రతినిధులు వెల్లడించారు. ట్రిబ్యునల్ జారీ చేసిన ఆర్డర్ కాపీని యాదాద్రి భువనగిరి జిల్లా చేనేత శాఖ ఏ.డి. అధికారికి కూడా అందజేసినట్లు తెలిపారు.చేనేత సహకార సంఘం ఎన్నికలు, చైర్మన్ ఎన్నికకు సంబంధించిన నిబంధనలు, ట్రిబ్యునల్ ఆదేశాలను సంబంధిత అధికారులు పరిగణనలోకి తీసుకుని తదుపరి చర్యలు చేపట్టాలని కుల సంఘం ప్యానెల్‌కు చెందిన డైరెక్టర్లు కోరారు.

# మండల కేంద్రంలో మత్స్య పారిశ్రామిక సొసైటీ నూతన పాలకవర్గం ఏకగ్రీవ ఎన్నిక

- మత్స్య పారిశ్రామిక సొసైటీ అధ్యక్షులు యాట ఉపేందర్




**తొలి అక్షరం/నెక్కొండ ఆగస్టు 8:** వరంగల్ జిల్లా నెక్కొండ మండల కేంద్రంలోని ముదిరాజ్ మత్స్య పారిశ్రామిక సొసైటీ రిజి/నెం273 జిల్లా ఎన్నికల అధికారి శ్రీనివాసరావు సమక్షంలో ముధిరాజ్ కమిటీ హాల్ నందు ఏకగ్రివంగా ఎన్నుకోవడం జరిగింది.వరంగల్ జిల్లా: నెక్కొండ గ్రామం, నెక్కొండ మండలానికి చెందిన ముదిరాజ్ మత్స్య పారిశ్రామిక సొసైటీ నం. 273 నూతన పాలకవర్గ ఎన్నికలు ఏకగ్రీవంగా జరగగా,ఈ ఎన్నికల్లో అధ్యక్షుడిగా యాట ఉపేందర్, -ఉపాధ్యక్షుడిగా సందెనబోయిన రమేష్, కోశాధికారిగా ముద్రబోయిన శ్రీకాంత్, ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.కార్యవర్గ సభ్యులు దుండి నిరంజన్, తోట మురళి, మోటెం కృష్ణ, చుంచు రాజు, చోప్పరి శ్రీను, సందెనబోయిన సాయి కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు యాట ఉపేందర్ మాట్లాడుతూ, సొసైటీ సభ్యుల సంక్షేమం, మత్స్యకారుల అభివృద్ధి, సొసైటీ బలోపేతం కోసం నూతన పాలకవర్గం సమష్టిగా కృషి చేస్తుందని తెలిపారు. సభ్యుల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు.ఉపాధ్యక్షుడు సందెనబోయిన రమేష్, కోశాధికారి ముద్రబోయిన శ్రీకాంత్ మాట్లాడుతూ, సభ్యుల సహకారంతో సొసైటీని మరింత అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తామని తెలిపారు.ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగేందుకు సహకరించిన సొసైటీ సభ్యులందరికీ నూతన పాలకవర్గం కృతజ్ఞతలు తెలిపింది. నూతనంగా ఎన్నికైన పాలకవర్గానికి పలువురు అభినందనలు, శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో కుల పెద్దమనిషి దుండి రవి , మాజీ కార్యవర్గ సభ్యులు కుల పెద్దలు ,కులసంగ సభ్యులు పాల్గొనడం జరిగింది.

# ఓటమిని ఒడిసిపట్టి... ప్రజల నమ్మకంతో కాంగ్రెస్ పగ్గాలు!

## నెల్లికుదురు మండల అధ్యక్షుడిగా యాదవ రెడ్డి

### ఎన్నికల్లో ఓటమి.. ప్రజాక్షేత్రంలో గెలుపు నిరంతర ప్రజాసేవకు దక్కిన గుర్తింపు

**తొలి అక్షరం/రాష్ట్ర బ్యూరో సాంబ ఆగస్టు8:** నెల్లికుదురు రాజకీయాల్లో గెలుపు ఓటములు సహజం. కానీ ఓటమి తర్వాత నాయకుడి అడుగులు ఎటువైపు పడతాయన్నదే అతని రాజకీయ భవిష్యత్తును నిర్ణయిస్తుంది. ఓటమితో వెనక్కి తగ్గకుండా.. ప్రజల మధ్యే ఉంటూ వారి సమస్యలపై పోరాడితే ప్రజలే మరోసారి అవకాశం ఇస్తారనడానికి నెల్లికుదురు మండలంలో యాదవ రెడ్డి రాజకీయ ప్రస్థానం ఓ ఉదాహరణగా నిలుస్తోంది.గత జెడ్పీటీసీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి చేతిలో స్వల్ప ఓట్ల తేడాతో ఓటమి ఎదురైంది. సాధారణంగా ఇలాంటి ఫలితం నాయకుడిని కొంతకాలం రాజకీయాలకు దూరం చేస్తుంది. కానీ యాదవ రెడ్డి విషయంలో అందుకు భిన్నమైన పరిస్థితి కనిపించింది. ఓటమి తర్వాత కూడా ప్రజలకు దూరం కాకుండా.. గ్రామాల్లో తిరుగుతూ వారి కష్టసుఖాల్లో పాలుపంచుకున్నారు. సమస్య ఏదైనా తన దృష్టికి వస్తే స్పందించే నాయకుడిగా క్రమంగా గుర్తింపు పొందారు. ఎన్నికల్లో ఓడినా.. ప్రజల మధ్య మాత్రం ఓడిపోలేదు. ఇదే ఆయన రాజకీయ ప్రయాణంలో కీలక మలుపుగా మారింది.నెల్లికుదురు మండలంలోని వివిధ గ్రామాల్లో ప్రజలతో ఏర్పరచుకున్న అనుబంధం, కార్యకర్తలతో కొనసాగించిన సంబంధాలు ఆయనకు ప్రత్యేక గుర్తింపును తీసుకొచ్చాయి. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా పనిచేసిన సమయంలో పార్టీ కార్యక్రమాలను చురుగ్గా నిర్వహిస్తూ క్షేత్రస్థాయిలో కాంగ్రెస్ శ్రేణులను







సమన్వయం చేయడంలో కీలకంగా వ్యవహరించారు. ఎమ్మెల్యే, ఎంపీ ఎన్నికల్లో నెల్లికుదురు మండలంలో కాంగ్రెస్‌కు లభించిన మెజారిటీ వెనుక పార్టీ శ్రేణుల కృషితో పాటు స్థానిక నాయకత్వం చేసిన సమన్వయం కూడా ప్రాధాన్యం సంతరించుకుంది.అయితే యాదవ రెడ్డి ప్రయాణం అంతా సాఫీగా సాగలేదు. రాజకీయాల్లో ఎదురైన అవమానాలు, విమర్శలు, సవాళ్లను అధిగమిస్తూ ముందుకు సాగారు. కొన్ని సందర్భాల్లో సొంత పార్టీ విధానాలపై కూడా ప్రశ్నలు సంధించారు. అయితే అవి వ్యక్తిగత ప్రయోజనాల కోసం కాకుండా.. ప్రజల సమస్యలను పార్టీ దృష్టికి తీసుకెళ్లాలనే ఉద్దేశంతోనే అన్న అభిప్రాయం ఆయనను దగ్గరగా పరిశీలించిన వర్గాల్లో వ్యక్తమవుతోంది.పార్టీ కోసం పనిచేయడం ఒక బాధ్యత అయితే.. ప్రజల కోసం నిలబడటం తన రాజకీయ ధర్మంగా భావించిన తీరు ఆయనకు ప్రత్యేక గుర్తింపును తీసుకొచ్చింది.ఈ క్రమంలో ఆయన అంకితభావాన్ని, పార్టీ పట్ల నిబద్ధతను గుర్తించిన అధిష్ఠానం తాజాగా కీలక బాధ్యతలను అప్పగించింది. నెల్లికుదురు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా యాదవ రెడ్డి నియమితులయ్యారు.ఈ నియామకం ఒక పదవిని అప్పగించడం మాత్రమే కాదని.. ఎన్నో సంవత్సరాలుగా క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న నాయకత్వానికి దక్కిన గుర్తింపుగా కాంగ్రెస్ శ్రేణులు భావిస్తున్నాయి.ఒకప్పుడు స్వల్ప ఓట్ల తేడాతో ఎదురైన ఓటమి.. ఇప్పుడు పార్టీ పగ్గాలు అందుకునే స్థాయికి తీసుకొచ్చింది. ఓటమిని అడ్డంకిగా కాకుండా.. తదుపరి విజయానికి మెట్టుగా మలుచుకున్న యాదవ రెడ్డి రాజకీయ ప్రస్థానం ఇప్పుడు మరో దశలోకి అడుగుపెట్టింది.నెల్లికుదురులో పార్టీని గ్రామస్థాయి నుంచి మరింత బలోపేతం చేయడం, కార్యకర్తలను సమన్వయం చేయడం, ప్రజా సమస్యలను పార్టీ వేదికపై బలంగా వినిపించడం ఆయన ముందున్న ప్రధాన బాధ్యతలుగా నిలవనున్నాయి.ప్రజల మధ్య పుట్టిన నాయకత్వానికి.. ప్రజల మధ్యే బలం లభించింది. ఇప్పుడు ఆ బలంతో కాంగ్రెస్ పగ్గాలు చేపట్టిన యాదవ రెడ్డి ప్రస్థానం ఎటువైపు సాగుతుందన్నది నెల్లికుదురు రాజకీయాల్లో ఆసక్తికరంగా మారింది.

# కొందుర్గు పీఏసీఎస్ చైర్మన్‌గా తుమ్మలపల్లి జితేందర్ రెడ్డి నియామకం

## రైతుల అభివృద్ధికి కృషి చేస్తా:పీఏసీఎస్ చైర్మన్ జితేందర్ రెడ్డి

## ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ , కాంగ్రెస్ పార్టీ నాయకులు కృతజ్ఞతలు తెలిపిన పీఏసీఎస్ చైర్మన్ జితేందర్ రెడ్డి



**తొలి అక్షరం/షాద్ నగర్, ఆగస్టు08:** రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ నియోజకవర్గంలోని కొందుర్గు మండల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్) చైర్మన్‌గా తుమ్మలపల్లి జితేందర్ రెడ్డి నియమితులయ్యారు. శనివారం నియామక పత్రాన్ని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ చేతుల మీదుగా ఆయన అందుకున్నారు.రేగడి చిక్కమద్రి గ్రామానికి చెందిన జితేందర్ రెడ్డి చిన్ననాటి నుంచే రాజకీయాల్లో చురుకుగా పనిచేశారు. సాధారణ రైతు కుటుంబంలో జన్మించిన ఆయన విద్యార్థి సంఘం నాయకుడిగా, యూత్ కాంగ్రెస్ నాయకుడిగా, సింగిల్ విండో డైరెక్టర్‌గా, జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడిగా వివిధ బాధ్యతలు నిర్వహించారు. ప్రజలు, రైతుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తూ కాంగ్రెస్ పార్టీలో నిజాయితీ, నిబద్ధత కలిగిన నాయకుడిగా గుర్తింపు పొందారు.పీఏసీఎస్ చైర్మన్‌గా జితేందర్ రెడ్డి నియామకంపై కొందుర్గు మండల ప్రజలు, రైతులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జితేందర్ రెడ్డి మాట్లాడుతూ తనపై నమ్మకంతో బాధ్యత అప్పగించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఏఐసీసీ జనరల్ సెక్రటరీ చల్లా వంశీచంద్ రెడ్డి, ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్ రెడ్డి, మామిడి శామ్ సుందర్ రెడ్డి తదితర పార్టీ పెద్దలకు కృతజ్ఞతలు తెలిపారు.ప్రభుత్వం తరఫున ప్రజలకు, రైతులకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని, రైతుల సంక్షేమం, అభివృద్ధి కోసం నిరంతరం పనిచేస్తానని ఆయన పేర్కొన్నారు.

# రాంనగర్‌లోని షైన్ హైస్కూల్‌లో అత్యంత వైభవంగా బోనాల పండుగ







**తొలి అక్షరం/హన్మకొండ ప్రతినిధి:** తెలంగాణ రాష్ట్రానికి ప్రతీకగా నిలిచే బోనాల పండుగను హనుమకొండ రాంనగర్‌లోని షైన్ హై స్కూల్‌లో అత్యంత వైభవంగా నిర్వహించారు.పాఠశాల విద్యార్థులు సాంప్రదాయ దుస్తుల్లో బోనాలు ఎత్తుకుని ఊరేగింపులో పాల్గొనగా,పోతరాజులు,అమ్మవారి వేషధారణలో విద్యార్థులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు.పాఠశాల ప్రాంగణం పండుగ వాతావరణంతో కళకళలాడగా,విద్యార్థుల ప్రదర్శనలు తల్లిదండ్రులు,ఉపాధ్యాయులను విశేషంగా ఆకట్టుకున్నాయి.రాంనగర్ షైన్ హై స్కూల్ నుండి భువనేశ్వరి మాత ఆలయం వరకు బోనాలు తలపై ఎత్తుకొని విద్యార్థులతో పాటు పాఠశాల ఆధ్యాపకులు అమ్మవారికి బోనాలు సమర్పించారు.ఈ కార్యక్రమం ద్వారా చిన్నారులకు తెలంగాణ సంస్కృతి,ఆచారాలు,సంప్రదాయాలపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపల్ ప్రగతి రెడ్డి మాట్లాడుతూ...ప్రతి సంవత్సరం బోనాలు,బతుకమ్మ,సంక్రాంతి,వినాయక చవితి వంటి అన్ని ప్రధాన పండుగలను ఘనంగా నిర్వహిస్తూ,వాటి చారిత్రక,సాంస్కృతిక ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరిస్తున్నామని తెలిపారు.పిల్లల్లో భారతీయ సంస్కృతి,సంప్రదాయాల పట్ల గౌరవం పెంపొందించడమే తమ లక్ష్యమని ఆమె పేర్కొన్నారు.



## పీఏసీఎస్ నూతన చైర్మన్లు, పాలకవర్గ సభ్యులకు మాజీ జెడ్పీటీసీ తండ్ర విశాల శ్రావణ్ రెడ్డి అభినందనలు

**తొలి అక్షరం/షాద్ నగర్, ఆగస్టు08:** షాద్‌నగర్ నియోజకవర్గ పరిధిలోని వివిధ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల (పీఏసీఎస్) నూతన చైర్మన్లు, పాలకవర్గ సభ్యులకు మాజీ జెడ్పీటీసీ తండ్ర విశాల శ్రావణ్‌రెడ్డి హృదయపూర్వక అభినందనలు తెలిపారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన వారు రైతుల సంక్షేమానికి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ప్రభుత్వం అందించే రుణాలు, విత్తనాలు, ఎరువులు, ఇతర వ్యవసాయ సేవలు రైతులకు సకాలంలో అందేలా పీఏసీఎస్‌లు సమర్థవంతంగా పనిచేయాలని అన్నారు. గ్రామస్థాయిలో రైతుల సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి చిత్తశుద్ధితో కృషి చేయాలని కోరారు. పీఏసీఎస్‌లు రైతుల ఆర్థికాభివృద్ధికి బలమైన వేదికలని పేర్కొన్నారు. సహకార వ్యవస్థను మరింత బలోపేతం చేసి, రైతుల విశ్వాసాన్ని నిలబెట్టేలా నూతన పాలకవర్గాలు పనిచేయాలని విశాల శ్రావణ్‌రెడ్డి ఆకాంక్షించారు.

# యువత రాజకీయాల్లో ముందుండాలి: ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న

### భూపాలపల్లి నుంచి భారీగా తరలివచ్చిన కళాశాల విద్యార్థులు

**తొలి అక్షరం/హన్మకొండ ప్రతినిధి:** జయశంకర్ భూపాలపల్లి జిల్లా తెలంగాణ రాజ్యాధికార పార్టీ అధ్యక్షుడు రవి పటేల్ ఆధ్వర్యంలో జిల్లాలోని వివిధ కళాశాలలకు చెందిన విద్యార్థులు పెద్ద ఎత్తున హనుమకొండకు తరలివచ్చారు.హనుమకొండ పబ్లిక్ గార్డెన్ ఎదుట విద్యార్థులు నినాదాలు చేస్తూ ఉత్సాహంగా కార్యక్రమంలో పాల్గొన్నారు.పబ్లిక్ గార్డెన్ నుండి అంబేద్కర్ సెంటర్ వరకు భారీ ర్యాలీగా వెళ్లారు.తీన్మార్ మల్లన్న ఆశయాలు,ఆకాంక్షలకు ఆకర్షితులైన పలువురు విద్యార్థులు తెలంగాణ రాజ్యాధికార పార్టీ కండువాలు కప్పుకొని పార్టీలో చేరారు.అనంతరం రవి పటేల్ ఆధ్వర్యంలో విద్యార్థులు అంబేద్కర్ భవన్‌లో నిర్వహించిన "జెన్జీ యువత చర్చ



విత్ తీన్మార్ మల్లన్న" కార్యక్రమంలో పాల్గొన్నారు.హనుమకొండ అంబేద్కర్ భవన్‌లో సుమారు 2,000 మంది విద్యార్థులతో ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న యువతతో భవిష్యత్ రాజకీయాలపై చర్చించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...యువత రాజకీయాల్లో ముందుండి నడవాలని,రాష్ట్ర రాజకీయాల్లో యువత కీలక పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు.రాష్ట్రంలో రాజకీయ మార్పు తీసుకురావడంలో యువత పాత్ర ఎంతో కీలకమని,యువతకు తెలంగాణ రాజ్యాధికార పార్టీ తగిన అవకాశాలు కల్పిస్తుందని తీన్మార్ మల్లన్న తెలిపారు.విద్యార్థులు,యువత తమ భవిష్యత్‌పై స్పష్టమైన అవగాహనతో ప్రజా సమస్యలపై పోరాడాలని ఆయన సూచించారు.ఈ కార్యక్రమంలో జయశంకర్ భూపాలపల్లి జిల్లా నుండి జిల్లా ఉపాధ్యక్షుడు ఇనుగాల ప్రణయ్ రాజ్,జనరల్ సెక్రటరీ పిట్టల వెంకటేష్,క్రమశిక్షణ కమిటీ చైర్మన్ గందు కరుణాకర్,బొగ్గు గని కార్మిక విభాగం అధ్యక్షుడు అనంతుల సంపత్ బొట్టు,జిల్లా పార్టీ మీడియా ఇన్‌చార్జి మడే సంతోష్,బసవరాజుపల్లి గ్రామ కమిటీ అధ్యక్షుడు అంబటి అశోక్ యాదవ్,వనం నరేష్ తదితరులు పాల్గొన్నారు.

# కేశంపేట్ పీఏసీఎస్‌కు కొత్త చైర్మన్.. యెన్నం శ్రీధర్ రెడ్డి నియామకం

### రైతుల అభివృద్ధికి కృషి చేస్తా: పీఏసీఎస్ చైర్మన్ శ్రీధర్ రెడ్డి

### ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ , కాంగ్రెస్ పార్టీ నాయకులు కృతజ్ఞతలు తెలిపిన పీఏసీఎస్ చైర్మన్ శ్రీధర్ రెడ్డి





**తొలి అక్షరం/కేశంపేట్,ఆగస్టు08:** కేశంపేట్ మండల ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం (పీఏసీఎస్) చైర్మన్‌గా యెన్నం శ్రీధర్ రెడ్డి నియమితులయ్యారు.శనివారం నియామక పత్రాన్ని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ చేతుల మీదుగా ఆయన అందుకున్నారు. నూతన బాధ్యతలు చేపట్టిన సందర్భంగా ఆయన సీఎం రేవంత్ రెడ్డి, షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌తో పాటు కాంగ్రెస్ పార్టీ అధిష్టానానికి కృతజ్ఞతలు తెలిపారు.పీఏసీఎస్ ద్వారా రైతులకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేస్తానని శ్రీధర్ రెడ్డి అన్నారు. రైతులకు సకాలంలో, వేగవంతంగా రుణాలు అందించడంతో పాటు పరపతి సేవలను విస్తరించి సంఘం అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. రైతుల సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుని వాటి పరిష్కారానికి ప్రాధాన్యం ఇస్తానన్నారు. రైతాంగ సంక్షేమమే తన ప్రధాన లక్ష్యమని, పీఏసీఎస్‌ను రైతులకు మరింత చేరువ చేసేలా పనిచేస్తానని శ్రీధర్ రెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తాండ్ర విశాల శ్రావణ్ రెడ్డి, మండలం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రమేష్ తదితరులు పాలొగొన్నారు.

# బీసీల సంక్షేమం, ఆత్మగౌరవ భవనాల పూర్తి, పార్టీ బలోపేతంపై సమావేశం



### సమావేశంలో పాల్గొన్న షాద్‌నగర్ ఎమ్మెల్యే, ప్రభుత్వ రంగ సంస్థల కమిటీ చైర్మన్ వీర్లపల్లి శంకర్

**తొలి అక్షరం/షాద్ నగర్, ఆగస్టు08:** హైదరాబాద్‌లోని మినిస్టర్ క్వార్టర్స్‌లో మంత్రి పొన్నం ప్రభాకర్ నివాసంలో బీసీల సంక్షేమం, అభివృద్ధిపై కీలక సమావేశం నిర్వహించారు. షాద్‌నగర్ ఎమ్మెల్యే, ప్రభుత్వ రంగ సంస్థల కమిటీ చైర్మన్ వీర్లపల్లి శంకర్ పాల్గొన్నారు. బీసీల ఆర్థిక అభ్యున్నతి, సంక్షేమ పథకాల అమలు, ఆత్మగౌరవ భవనాల నిర్మాణాల పూర్తి తదితర అంశాలపై విస్తృతంగా చర్చించారు. అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు పూర్తిస్థాయిలో అందేలా చర్యలు తీసుకోవాలని సమీక్షించారు. హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన మహాత్మా జ్యోతిరావు పూలే, సావిత్రిబాయి పూలే, సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహాల ప్రారంభ తేదీల ఖరారుపై చర్చించారు. బీసీ మహనీయుల సేవలు, సామాజిక పోరాటాలను భవిష్యత్ తరాలకు తెలియజేసేలా కార్యక్రమాలను ఘనంగా నిర్వహించాలని నిర్ణయించారు.

# దక్షిణ కాశీగా ప్రసిద్ధిగాంచిన మెట్టుగుట్ట పవిత్రోత్సవాలకు ఎమ్మెల్యే కె.ఆర్ నాగరాజును ఆహ్వానించిన ఆలయ కార్య నిర్వహణ అధికారులు



**తొలి అక్షరం/హన్మకొండ ప్రతినిధి:** వరంగల్ మహానగరంలోని కాజీపేట మండలం మడికొండ గ్రామంలో గల దక్షిణ కాశీగా ప్రసిద్ధిగాంచిన శ్రీ మెట్టు రామలింగేశ్వర ఆలయం శ్రీ సీతారామచంద్ర స్వామి దేవాలయంలో ఆగస్టు 9 10 వ తేదీలలో జరిగే పవిత్రోత్సవాలకు వర్ధన్నపేట నియోజకవర్గ శాసనసభ్యులు కేఆర్ నాగరాజుని మెట్టుగుట్ట ఆలయ కార్య నిర్వహణ అధికారి సత్యనారాయణ,శివాలయం పునరుద్ధరణ కమిటీ చైర్మన్ పైడిపాల రఘు చందర్,రామాలయ అర్చకులు విష్ణువర్ధనాచార్యులు,అభిలాష్ శర్మ సుబేదారిలోని ఎమ్మెల్యే కాంప కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి అర్చక స్వాముల ఆశీర్వచనం తో స్వామివారి ప్రసాదం అందజేసి రెండు రోజులపాటు నిర్వహించే పవిత్ర ఉత్సవాలకు సంబంధించిన ఆహ్వాన పత్రికను అందజేయడం జరిగింది.లోక కళ్యాణం కోసం జరిగే కార్యక్రమాలకు,తక్షణ కాశిగా ప్రసిద్ధిగాంచిన కాజీపేట మెట్టుగుట్టపై భక్తిశ్రద్ధలతో నిర్వహించే పవిత్రోత్సవాలకు తప్పకుండా హాజరవుతానని కే.ఆర్ నాగరాజు అన్నారు.ఈ కార్యక్రమాలు ఆలయ కార్య నిర్వహణ అధికారి సత్యనారాయణ,శివాలయ కమిటీ చైర్మన్ పైడిపాల రఘు చందర్,ఆధ్వర్యంలో అర్చకులు రాగిచెడు అభిలాష్ శర్మ,పరాశర విష్ణువర్ధనాచార్యులు,ధర్మకర్తలు ప్రముఖులు పాల్గొన్నారు.

# పదవులు నిండుగా.. సేద్యానికి పండుగ

### షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

### నిజమైన.. నికార్సైన నాయకులకే అవకాశం..

### పనిచేసే ప్రతి నాయకుడికి రాజకీయ భవిష్యత్తు

### రైతులకు నూతన చైర్మన్లు, వైస్ చైర్మన్లు, డైరెక్టర్లు అండగా ఉండాలి





**తొలి అక్షరం/షాద్ నగర్, ఆగస్టు08:** వ్యవసాయ రంగాన్ని మరింత విస్తృతం చేసే దిశగా ప్రభుత్వం నూతనంగా ఎంపిక చేసిన చైర్మన్లు, వైస్ చైర్మన్లు, డైరెక్టర్ల వ్యవస్థ ద్వారా నియోజకవర్గంలో రైతులకు సేవలు మరింత విస్తృతం కానున్నాయని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. శనివారం పట్టణంలోని తన క్యాంపు కార్యాలయంలో నూతనంగా ఎంపికైన ఆరుగురు చైర్మన్లు, ఆరుగురు వైస్ చైర్మన్లు, 74 మంది డైరెక్టర్లను ఆయన ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ.. నియోజకవర్గ వ్యాప్తంగా రైతులకు సేవలందించేందుకు సింగిల్ విండో చైర్మన్లను ఎంపిక చేశామని, నిజమైన, నికార్సైన నాయకులకు అవకాశాలు దక్కడం సంతోషకరమని పేర్కొన్నారు. వ్యవసాయ రంగానికి అదనపు వన్నెలు తీసుకురావడానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి చేపట్టిన ఈ కార్యక్రమం ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని అభిప్రాయపడ్డారు. గతంలో ఇందిరాగాంధీ ప్రధానమంత్రిగా ఉన్న సమయంలో రైతుల కోసం పీఏసీఎస్ సొసైటీలు ఏర్పాటు చేశారని ఎమ్మెల్యే గుర్తుచేశారు. తద్వారా వ్యవసాయదారుల పేర్లను నమోదు చేసి, రుణాల విషయంలోనూ, సబ్సిడీల విషయంలోనూ వారికి అవకాశం కల్పించడం జరిగిందన్నారు. రైతులు వారి అవసరాలకు అనుగుణంగా సబ్సిడీ వస్తువులు, సబ్సిడీ విత్తనాలు, సబ్సిడీ పనిముట్లు, సబ్సిడీ ఎరువులు పొందేందుకు ఈ సొసైటీలు అవకాశం కల్పిస్తున్నాయని తెలిపారు.నియోజకవర్గంలో సొసైటీల పనితీరు బాగుందని, నూతనంగా బాధ్యతలు చేపట్టిన చైర్మన్లు, వైస్ చైర్మన్లు, డైరెక్టర్లు చిత్తశుద్ధితో పనిచేసి రైతులకు సహకారం అందించాలని సూచించారు. కొందుర్గు మండలంలో దామోదర్ రెడ్డి, షాద్‌నగర్, చేగూరు, మేకగూడ సొసైటీలలో సభ్యులు బాగా పనిచేస్తున్నారని ఆయన అభినందించారు. అయితే నందిగామ ఈ విషయంలో కొంతమేర వెనుకబడి ఉందని, దీనిని సరిదిద్దుకోవాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. మిగతా సొసైటీలన్నీ రైతులకు నిరంతరం అందుబాటులో ఉంటున్నాయని తెలిపారు.కొత్తగా ఎన్నికలు నిర్వహించకుండా నామినేషన్ ద్వారా చైర్మన్లు, వైస్ చైర్మన్లు, డైరెక్టర్లను నియమించి రైతులకు అందుబాటులోకి తీసుకురావడం వ్యవసాయ రంగంలో పెను మార్పులకు కారణమవుతుందని ఎమ్మెల్యే అన్నారు. పదవులు పొందిన ప్రతి ఒక్కరూ తమ బాధ్యతలను చిత్తశుద్ధితో నిర్వహించాలని సూచించారు. "నాయకులుగా మేము అప్పుడప్పుడు అందుబాటులో ఉంటాం. కానీ సొసైటీ సభ్యులు మాత్రం నిరంతరం రైతులకు అందుబాటులో ఉండాలి. విత్తనాలు నాటే దగ్గర నుంచి పంట చేతికి అందించి, మార్కెట్‌కు తరలించే వరకు రైతులకు అండగా నిలవాల్సిన అవసరం ఉంది. పూర్తిస్థాయిలో రైతులకు సహకారం అందించాలి" అని ఎమ్మెల్యే స్పష్టం చేశారు.ప్రస్తుత వ్యవసాయ శాఖ ద్వారా రైతులకు అన్ని విధాలా సహకారం అందించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేయడంతో పాటు రైతుల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు నూతనంగా బాధ్యతలు చేపట్టిన చైర్మన్లు, వైస్ చైర్మన్లు, డైరెక్టర్లు కృషి చేయాలని సూచించారు.అనంతరం నూతనంగా ఎంపికైన చైర్మన్లు, వైస్ చైర్మన్లు, డైరెక్టర్లను ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. రైతులకు అండగా నిలిచి, వ్యవసాయ రంగ అభివృద్ధికి కృషి చేయాలని ఆకాంక్షించారు.

# కూరపాటి హాస్పిటల్లో ప్రపంచ వాస్క్యులర్ దినోత్సవం

### - గోడపత్రిక ఆవిష్కరణ...



**తొలి అక్షరం/హన్మకొండ ప్రతినిధి:** సేవ్ లింబ్స్..సేవ్ లైవ్స్ సందేశంతో వైద్య నిపుణులు కూరపాటి రమేష్ ప్రజల్లో అవగాహన కల్పించారు.ప్రపంచ వాస్క్యులర్ దినోత్సవాన్ని పురస్కరించుకుని కూరపాటి హాస్పిటల్లోని డయాబెటిక్ ఫుట్ అండ్ వాస్క్యులర్ డివిజన్ ఆధ్వర్యంలో వాస్క్యులర్ వ్యాధులు,మధుమేహ పాద సమస్యలపై అవగాహన కల్పించే ప్రత్యేక గోడపత్రికను కూరపాటి హాస్పిటల్ చైర్మన్ డా. కూరపాటి రమేష్ ఆవిష్కరించారు.ఈ సందర్భంగా సీనియర్ జనరల్ సర్జన్ ప్రొఫెసర్ డా.కూరపాటి రమేష్ మాట్లాడుతూ..."సేవ్ లింబ్స్... సేవ్ లైవ్స్" అనే నినాదం ప్రతి ఒక్కరికీ చేరువ కావాల్సిన అవసరం ఉందన్నారు.కాళ్లలో నొప్పి,పాదాల పై గాయాలు మానకపోవడం,రంగు మారడం,నడిచేటప్పుడు నొప్పి వంటి లక్షణాలను నిర్లక్ష్యం చేయకుండా వెంటనే వైద్యులను సంప్రదిస్తే కాలు తొలగించే పరిస్థితిని కూడా నివారించవచ్చని తెలిపారు.ముఖ్యంగా మధుమేహ రోగులు తమ పాదాలను ప్రతిరోజూ పరిశీలించు కోవడం,చిన్న గాయాలను కూడా నిర్లక్ష్యం చేయకూడదని డా.రమేష్ సూచించారు.వాస్క్యులర్ సర్జన్ డా. రోహిత్ రెడ్డి మాట్లాడుతూ...రక్తనాళాల వ్యాధులను ప్రారంభ దశలోనే గుర్తిస్తే చికిత్స మరింత సులభంగా,విజయవంతంగా ఉంటుందని తెలిపారు.డయాబెటిస్ ఉన్నవారు క్రమం తప్పకుండా పాద పరీక్షలు చేయించుకోవడం,అవసరమైనప్పుడు వాస్క్యులర్ నిపుణులను సంప్రదించడం ద్వారా తీవ్రమైన సమస్యలను నివారించవచ్చన్నారు.ప్రజల్లో అవగాహన పెంపొందించడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో డా.సుధాకర్ కల్పగిరి,డా.శ్రవణ్ కుమార్ మట్టెడ,డా.అచ్చా వరుణ్ బాబుతో పాటు కూరపాటి హాస్పిటల్ వైద్యులు,సిబ్బంది పాల్గొన్నారు.

# కల సాకారం అయినా వేళ గ్రామస్థుల ఆనంద హేళ

### వీర్లపల్లి, అంతిరెడ్డి గూడ లో పోశమ్మ గుడులకు సీసీ రోడ్ల పనులు ప్రారంభం

### 5 లక్షల స్వంత నిధులతో ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి చేయూత

### వీర్లపల్లి సర్పంచ్ చిందం పాండు అధ్వర్యంలో అభివృద్ధి పనులు

### హర్షం వ్యక్తం చేస్తున్న వీర్లపల్లి, అంతిరెడ్డి గూడ గ్రామ ప్రజలు





**తొలి అక్షరం/షాద్ నగర్, ఆగస్టు08:** షాద్ నగర్ నియోజకవర్గం నందిగామ మండలం వీర్లపల్లి, అంతిరెడ్డి గూడ గ్రామ శివారులో గల పోశమ్మ గుడులకు ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి తన స్వంత నిధులు 5 లక్షలతో సీసీ రోడ్లు మరియు ఇతర అభివృద్ధి పనులకు స్వీకారం చేపట్టారు. ఇన్నో ఏండ్లు గా స్థానికంగా ఉన్న పోశమ్మ గుడులు అభివృద్ధి కి నోచుకోకుండా వెనుకపడ్డాయి. ఈ సందర్భంగా వీర్లపల్లి మరియు అంతిరెడ్డి గూడ గ్రామ ప్రజల ఇబ్బందులను గుర్తించిన ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి తన ఉదారతను మరోసారి చాటుకున్నారు.ప్రభుత్వ నిధుల కోసం వేచి చూడకుండా,తన సొంత నిధులతో అభివృద్ధి కి ముందడుగు వేశారు. స్థానిక వీర్లపల్లి సర్పంచ్ చిందం పాండు కోరిక మేరకు 5 లక్షలు వెచ్చించి అభివృద్ధి చేపట్టారు. సర్పంచ్ చిందం పాండు సీసీ రోడ్లు మరియు ఇతర అభివృద్ధి పనులు ముందుండి పర్యవేక్షిస్తూ పనులను చేపడుతున్నారు.తమ సమస్యను విని సొంత ఖర్చులతో అభివృద్ధి పనులు చేపడుతున్న ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి మరియు గ్రామ క్షేమం కొరకు ఎల్లప్పుడూ అహర్నిశలు కృషి చేస్తున్న సర్పంచ్ చిందం పాండు గారిని ఇరు గ్రామస్తులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ అభివృద్ధి కార్యక్రమం లో వీర్లపల్లి సర్పంచ్ చిందం పాండు, గ్రామపంచాయతీ వార్డ్ సభ్యులు,గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

# గొంగిడి శ్రీరాములు కుటుంబ సభ్యులను పరామర్శించిన విక్రమ్





**తొలి అక్షరం/రామన్నపేట ఆగస్టు 8:** గుండెపోటు తో మరణించిన గొంగిడి శ్రీరాములు మృతుదేహానికి పూలమాల వేసి నివాళులు అర్పించి వారి కుటుంబ సభ్యులను ఓదార్చి వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియచేసినసర్పంచ్ గర్ధాస్ విక్రమ్ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ నల్ల జయసుధ స్వామి, వార్డ్ సభ్యులు వరికుప్పల స్వామి,వడ్లకొండ లక్ష్మి మల్లేశం,మాజీ ఏఎంసి డైరెక్టర్ మందడి విద్యాసాగర్ రెడ్డి, యువనాయకులు సింగణబోయిన గణేష్ యాదవ్,మంటి లింగస్వామి,రాజన్నగారి రమేష్, చేనేత సహకారసంఘము అధ్యక్షులు రవ్వ నర్సింహా,మాజీ ఏఎంసి డైరెక్టర్ గర్ధాస్ కరుణాకర్,మాజీ ఉపసర్పంచ్ సింగణబోయిన జంగయ్య యాదవ్,పాలసంఘము డైరెక్టర్ గర్ధాస్ వెంకటేష్,మంటి బిక్షపతి, సింగణబోయిన ఆంజనేయులు, నక్క వెంకటేష్, నల్ల రామస్వామి, కాటేపెల్లి మహేష్,వెలిమినేటి నరేష్, బోనగిరి మధు,గర్ధాస్ సాయి, భువనగిరి మహేష్,బొల్ల మత్స్యగిరి, మంటి మహేష్ తదితరులు పాల్గొన్నారు

# చేగూర్ సహకార సంఘంలో డైరెక్టర్‌గా జెట్ట శంకరయ్యకు కొత్త బాధ్యత

**• ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ చేతుల మీదుగా శంకరయ్య నియామక పత్రాన్ని అందుకున్నారు • ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ , కాంగ్రెస్ పార్టీ నాయకులు కృతజ్ఞతలు తెలిపిన డైరెక్టర్‌గా జెట్ట శంకరయ్య**





**తొలి అక్షరం/షాద్ నగర్, ఆగస్టు 08:** నందిగామ మండలంలోని చేగూర్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (PACS) డైరెక్టర్‌గా జెట్ట శంకరయ్య నియమితులయ్యారు. ఈ సందర్భంగా శనివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ చేతుల మీదుగా శంకరయ్య నియామక పత్రాన్ని అందుకున్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ (PACS) చైర్మన్లు, వైస్ చైర్మన్లు, డైరెక్టర్లు రైతుల సంక్షేమమే లక్ష్యంగా చిత్తశుద్ధితో పనిచేయాలని సూచించారు. సహకార సంఘాల ద్వారా రైతులకు మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేయాలని కోరారు.నూతన బాధ్యతలు స్వీకరించిన జెట్ట శంకరయ్య మాట్లాడుతూ తనపై నమ్మకంతో అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తానన్నారు. రైతుల సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తూ, వారికి అవసరమైన సహకారం అందించేందుకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని తెలిపారు. PACS అభివృద్ధితో పాటు రైతులకు అందే సేవలను మరింత మెరుగుపరుస్తానన్నారు.తనకు చేగూర్ PACS డైరెక్టర్‌గా అవకాశం కల్పించిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, నందిగామ కాంగ్రెస్ పార్టీ నాయకులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. శంకరయ్య నియామకంపై కాంగ్రెస్ నాయకులు, సహకార సంఘం ప్రతినిధులు, రైతులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నందిగామ మండలం యూత్ కాంగ్రెస్ వైస్ ప్రెసిడెంట్ హరీష్,మోత్కూల గూడ గ్రామం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు జెట్ట రాజు,ఉపాధ్యక్షులు రామస్వామి, కోశాధికారి మహేష్, గ్రామం 4 వార్డు సభ్యులు జెట్ట నరేష్,నాయకులు జెట్ట మహేష్, తదితరులు పాల్గొన్నారు.

# 10న జరిగే జైల్ భరోను జయప్రదం చేయండి

**- సిఐటియు రాష్ట్ర కమిటీ సభ్యులు చలమాల విఠల్ రావు**

**తొలి అక్షరం/పెనుబల్లి, ఆగస్టు 8:** స్థానిక వి.యం.బంజర్ రింగ్ సెంటర్ నందు ఆగస్టు 10న జరిగే జైల్ భరో కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని శనివారం సిఐటియు రాష్ట్ర కమిటీ సభ్యులు చలమాల విఠల్ రావు పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా ప్రచారం చేస్తున్న క్రమంలో కరపత్ర ప్రచారం మరియు జనరల్ బాడీ సమావేశం నిర్వహించడం జరిగింది అని తెలిపారు. ఈ సమావేశానికి రైతు సంఘం మండల అధ్యక్షుడు చిట్టి మోదుల కృష్ణ అధ్యక్షత వహించగా ముఖ్యఅతిథిగా పాల్గొన్న సిఐటియు రాష్ట్ర కమిటీ సభ్యులు చలమాల విఠల్ రావు మాట్లాడుతూ ఆగస్టు 10వ తారీఖున మండల కేంద్రంలో జైలు భరో కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. నాలుగు లేబర్ కోడ్ లు వాటి నిబంధనలను పూర్తిగా రద్దు చేయాలని, విద్యుత్ సంస్కరణ బిల్లు 2025ను వెనక్కి తీసుకోవాలి విద్యుత్తు రంగం ప్రైవేటీకరణను నిలిపివేయాలని, స్కీమ్ వర్కర్లను కార్మికులుగా గుర్తించి వారికి కనీస వేతనం అమలు చేయాలి అన్నారు. ఈ బిజీ రాంజీ చట్టాన్ని రద్దు చేసి పునరుద్ధరించాలని 200 రోజులు పని కల్పించి రోజు కూలి 7వందల రూపాయలు ఇవ్వాలని, స్వామినాథన్ కమిటీ సిఫార్సు ప్రకారం కనీస మద్దతు ధర ప్రకటించాలని డిమాండ్ చేశారు. పేద రైతులు కోసం సమగ్ర రుణమాఫీ అమలు చేయాలని, ఈ డిమాండ్స్ సాధన కోసం సిఐటియు, వ్యవసాయ కార్మిక సంఘం, రైతు సంఘం, ఆధ్వర్యంలో జరుగుతున్న జైల్ బరో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి చెమట విశ్వనాథం, మిద్దె స్వామి, అన్నపురెడ్డి లక్ష్మయ్య, గుజ్జ వెంకటేశ్వర్లు, మల్లెల వెంకటేశ్వర్లు, బాలస్వామి, తేజ వత్ రాములు, నాగేశ్వరావు, నాగయ్య, చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.



# ప్రజల హక్కుల కోసం ఐక్యంగా పోరాటం

**సిద్ధాపూర్ డంపింగ్ యార్డు వ్యతిరేక పోరాట జాయింట్ యాక్షన్ కమిటీ పిలుపు**



**తొలి అక్షరం/షాద్ నగర్, ఆగస్టు08:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రంగారెడ్డి జిల్లా కొత్తూరు మండలం సిద్ధాపూర్ గ్రామంలో "పర్యావరణ ఉద్యానవనం" పేరుతో డంపింగ్ యార్డు ఏర్పాటు కోసం జారీ చేసిన ప్రభుత్వ ఉత్తర్వు ఆర్టీ నంబర్ 641 ను వెంటనే రద్దు చేయాలని ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. ఈ ఉత్తర్వును రద్దు చేయాలనే డిమాండ్‌తో అన్ని రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు కలిసి సిద్ధాపూర్ డంపింగ్ యార్డు వ్యతిరేక పోరాట జాయింట్ యాక్షన్ కమిటీని ఏర్పాటు చేశాయి. ఈ కమిటీ ఆధ్వర్యంలో ఆగస్టు 11 మంగళవారం కొత్తూరు మండల తహసిల్దార్ కార్యాలయం వద్ద మొదటి దశగా ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ప్రకటించారు. ఈ ధర్నాను విజయవంతం చేయాలని కమిటీ నాయకులు పిలుపునిచ్చారు. కొత్తూరు పత్రికా కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో కమిటీ చైర్మన్ మూడావత్ రాంబాల్ నాయక్ మాట్లాడుతూ గత ప్రభుత్వం సిద్ధాపూర్‌లో పారిశ్రామిక ఉద్యానవనం కోసం భూసేకరణ చేస్తే, ఇప్పుడు అదే భూములను చెత్త డంపింగ్ యార్డు కోసం గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌కు కేటాయించడం దారుణమని అన్నారు. స్థానిక ఎమ్మెల్యే గతంలో డంపింగ్ యార్డు రానివ్వమని చెప్పి ఉద్యమాన్ని ఆపి పాలాభిషేకాలు చేయించుకున్న కొద్ది రోజుల్లోనే ఉత్తర్వు రావడం ప్రజలను మోసం చేయడమేనని విమర్శించారు. ఈ ఉత్తర్వు రద్దు కోసం ఆగస్టు 11 ధర్నాను విజయవంతం చేయాలని ఆయన కోరారు.కమిటీ సమన్వయకర్త తిరుమలయ్య మాట్లాడుతూ సిద్ధాపూర్‌లో డంపింగ్ యార్డు ఏర్పాటు చేయడం రాజ్యాంగం కల్పించిన జీవించే హక్కుకు భంగం కలిగించడమేనని అన్నారు. ఇది కేవలం సిద్ధాపూర్ సమస్య మాత్రమే కాదని, ఉస్మాన్ సాగర్ నీటిని తాగే సుమారు 20 లక్షల మంది ప్రజల ఆరోగ్య సమస్య అని హెచ్చరించారు. వర్షాకాలంలో చెరువుల ద్వారా కలుషిత నీరు ఉస్మాన్ సాగర్‌లోకి చేరే ప్రమాదం ఉందని తెలిపారు. ఉత్తర్వు రద్దు అయ్యే వరకు ఐక్యంగా పోరాడాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు. కమిటీ సహాధ్యక్షుడు ఎమ్మె సత్యనారాయణ మాట్లాడుతూ ప్రజా పాలన పేరుతో ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నారని విమర్శించారు. కాంగ్రెస్ నాయకులు మోసపూరిత మాటలతో ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వంతోనే చర్చలు జరపాల్సిన అవసరం ఉండగా కలెక్టర్లతో చర్చలు జరపడం ప్రయోజనం లేదని అన్నారు. కమిటీ కన్వీనర్ పినపాక ప్రభాకర్ మాట్లాడుతూ అభివృద్ధి పేరుతో ప్రజల భవిష్యత్తును ప్రమాదంలోకి నెట్టడం క్షమించరాని విషయమని అన్నారు. ఇప్పటికే పారిశ్రామికంగా అభివృద్ధి చెందిన ఈ ప్రాంతంలో నిరుద్యోగ సమస్య పెరుగుతుండగా, స్థానికులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాల్సిన అవసరం ఉందని చెప్పారు. ప్రజల ఆరోగ్యాన్ని ప్రమాదంలోకి నెట్టే ప్రభుత్వ ఉత్తర్వు ఆర్టీ నంబర్ 641ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఆగస్టు 11 ధర్నాలో అన్ని రాజకీయ పార్టీలకు అతీతంగా ప్రతి ఒక్కరూ పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో కమిటీ సమన్వయకర్త టీజీ శ్రీనివాస్, సహాధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి, వడ్డే బాలయ్య, సహకన్వీనర్లు ఈశ్వర్ నాయక్, రవీంద్రనాథ్, అర్జునప్ప, రాజు, దేవేందర్ యాదవ్, కేకే కృష్ణ, యాదయ్య, నక్కల వెంకటేష్ గౌడ్, కోస్గి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# గుండెపోటుతో కుటుంబ పెద్ద మృతి.. ముగ్గురు ఆడపిల్లల కుటుంబానికి మన ఆపద్బాంధవులు చేయూత

**50 కేజీల బియ్యం 14 రకాల నిత్యవసర సరుకుల పంపిణీ**


**మన దగ్గర ఉన్నదాన్ని పంచుకోవడం దానం... మనసుతో పంచుకునే చేయూతే మానవత్వం.**

**నీలం శేఖర్ మన ఆపద్బాంధవులు ఫౌండేషన్ ముఖ్య సభ్యులు**




**తొలి అక్షరం/రామన్నపేట ఆగస్టు 8:** రామన్నపేట మండలంలోని జనంపల్లి గ్రామానికి చెందిన గంగిరెద్దుల కుటుంబానికి చెందిన అవుల రమేష్ గత నెల 20వ తేదీన గుండెపోటుతో మృతి చెందారు. దీంతో కుటుంబం పెద్దదిక్కును కోల్పోయి తీవ్ర ఆర్థిక ఎదుర్కొంటున్న పరిస్థితి గమనించితన భార్య వెంకటమ్మ, ముగ్గురు ఆడపిల్లలతో కలిసి జనంపల్లి గ్రామంలోనే నివాసం ఉంటూ గంగిరెద్దులతో ఊరూరా తిరుగుతూ జీవనం సాగించేవారు. కుటుంబానికి ఇతర ఏలాంటి ఆస్తిపాస్తులు లేకపోవడంతో ప్రస్తుతం రేకుల ఇంట్లోనే నివాసం ఉంటున్నారు.ఈ కుటుంబ పరిస్థితిని గమనించిన జనంపల్లి గ్రామ మాజీ సర్పంచ్ పోషబోయిన మల్లేశం మన ఆపద్బాంధవులు ఫౌండేషన్ ముఖ్య సభ్యులు నీలం శేఖర్ దృష్టికి తీసుకువచ్చారు. వెంటనే స్పందిస్తూ ఈ రోజు ఆ కుటుంబానికి 50 కేజీల బియ్యం 14 రకాల నిత్యవసర సరుకులు వారి నివాసంలో అందజేయడం జరిగింది.ఈ సందర్భంగా ఫౌండేషన్ ముఖ్య సభ్యులు నీలం శేఖర్ పాల్గొని వారు మాట్లాడుతూ,"మన సహాయం ఎంత చిన్నదైనా కావచ్చుకానీ లిఆ సహాయం కోసం ఎదురుచూస్తున్న మనిషికి అది ఒక కొత్త జీవితమే.లిమన చేతి నుంచి వెళ్లే చేయూతఒక కుటుంబం కళ్లలో కన్నీటిని తుడిచి,వారి జీవితంలో ఆశను నింపగలదు." "కుటుంబ పెద్దను కోల్పోయి ముగ్గురు ఆడపిల్లల బాధ్యతను ఒంటరిగా మోస్తున్న వెంకటమ్మ కుటుంబ పరిస్థితి ఎంతో బాధాకరం. ఇలాంటి ఆపద సమయంలో మానవతావాదులందరూ తమవంతు సహాయం అందించి ఆ కుటుంబానికి అండగా నిలవాలి. ఈ ముగ్గురు ఆడపిల్లల చదువులు మధ్యలో ఆగిపోకుండా వారి విద్యకు అవసరమైన సహకారం అందించేందుకు మన ఆపద్బాంధవులు ఫౌండేషన్ కృషి చేస్తుంది" అని తెలిపారు.మన ఆపద్బాంధవులు ఫౌండేషన్ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల పరిధిలో ఇప్పటివరకు దాదాపు 2,000/- (రెండూ వేల)కుటుంబాలకు రూ.40,00000/- నలభై లక్షల మేర సహాయం అందిస్తూ ముందుకు సాగుతోందని... అలాగే ఫౌండేషన్‌లోని సుమారు 1,000/- వెయ్యి మంది సభ్యుల సహకారంతో వివిధ కారణాలతో కుటుంబ పెద్ద దిక్కు కోల్పోయిన కుటుంబాలకు అండగా నిలుస్తున్నామని, ఇప్పటివరకు 17 కుటుంబాలకు జీవనోపాధి కల్పించేలా సహకారం అందించామని పేర్కొన్నారు.ఆపదలో ఉన్న కుటుంబాల్లోని విద్యార్థుల చదువులకు భరోసా కల్పించడం, నిరుపేద కుటుంబాలకు జీవనోపాధి కల్పించడం, కుటుంబ పెద్దను కోల్పోయిన కుటుంబాలకు మానవతా దృక్పథంతో అండగా నిలవడం తమ ఫౌండేషన్ ప్రధాన లక్ష్యమని తెలిపారు."ఈ ముగ్గురు ఆడపిల్లల భవిష్యత్తు కోసం ఫౌండేషన్ సభ్యులు, దాతలు, మానవతావాదుల సహకారంతో నిరంతరం కృషి చేస్తాం. ఆపదలో ఉన్న కుటుంబానికి మనమంతా కలిసి అండగా నిలిస్తే వారి జీవితాల్లో కొత్త ఆశలు నింపగలం" అని నీలం శేఖర్ అన్నారు.ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు వేముల సైదులు, బాదే చంద్రశేఖర్, ఈదులకంటి శివకుమార్ , సురేష్ , రాజు, మృతుని భార్య వెంకటమ్మ, నరేష్ , మధు , తదితరులు పాల్గొన్నారు.

# శేఖర్ సేనాపతి జన్మదినం సందర్భంగా ఘనంగా రక్తదాన శిబిరం



**రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలిచిన దాతలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపిన యువచైతన్య దీపం ఫౌండేషన్ వ్యవస్థాపకులు శేఖర్ సేనాపతి**




**తొలి అక్షరం/రాజన్న సిరిసిల్ల ఆగస్టు 08:** రాజన్న సిరిసిల్ల జిల్లాకు చెందిన యువచైతన్య దీపం ఫౌండేషన్ వ్యవస్థాపకులు శేఖర్ సేనాపతి జన్మదినం సందర్భంగా రక్తదాన శిబిరాన్ని ఘనంగా నిర్వహించారు. ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పలువురు రక్తదాతలు స్వచ్ఛందంగా రక్తదానం చేసి మానవతా దృక్పథాన్ని చాటుకున్నారు.ఈ సందర్భంగా శేఖర్ సేనాపతి మాట్లాడుతూ.. తన జన్మదినాన్ని పురస్కరించుకుని రక్తదానం చేసిన ప్రతి ఒక్క రక్తదాతకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. రక్తదానం ద్వారా అత్యవసర పరిస్థితుల్లో ఎంతోమంది ప్రాణాలను కాపాడే అవకాశం ఉంటుందని, ప్రతి ఒక్కరూ రక్తదానంపై అవగాహన పెంచుకుని ముందుకు రావాలని కోరారు.తన జన్మదిన సందర్భంగా శుభాకాంక్షలు తెలిపిన ప్రతి ఒక్కరికీ శేఖర్ సేనాపతి మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు తెలిపారు. రక్తదానం చేసిన దాతలందరికీ భగవంతుడు సంపూర్ణ ఆరోగ్యం, సంతోషం ప్రసాదించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమానికి సహకరించిన సిరిసిల్ల ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డా. శ్రీ బి. ప్రవీణ్ కుమార్, బ్లడ్ బ్యాంక్ ఇన్‌చార్జి హరి ప్రసాద్, మమత మేడంతో పాటు ఆసుపత్రి సిబ్బందికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.**ముఖ్య అతిథులుగా పలువురు ప్రముఖులు** రక్తదాన శిబిరానికి తెలంగాణ రాష్ట్ర ప్రొటెక్షన్ ఆఫ్ లీగల్ అండ్ హ్యూమన్ రైట్స్ స్టేట్ కార్యదర్శి లాల్ మొహమ్మద్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అలాగే సిరిసిల్ల పట్టణ వాత్సల్య బ్లడ్ బ్యాంక్ ఫౌండర్ సుధాకర్ పాల్గొని రక్తదాతలను అభినందించారు.రక్తదానం చేసిన ప్రతి ఒక్కరిని ఈ సందర్భంగా శేఖర్ సేనాపతి ప్రత్యేకంగా అభినందించి కృతజ్ఞతలు తెలిపారు. జన్మదిన వేడుకలను కేవలం సంబరాలకు పరిమితం చేయకుండా రక్తదానం వంటి సేవా కార్యక్రమంతో నిర్వహించడం అభినందనీయమని పలువురు పేర్కొన్నారు."ఒక్క యూనిట్ రక్తం.. ఒక ప్రాణానికి ఆశ" అనే సందేశంతో నిర్వహించిన ఈ కార్యక్రమం ద్వారా మానవతా విలువలను చాటుతూ, యువత సేవా కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని నిర్వాహకులు పిలుపునిచ్చారు.



# బిడ్డ కోసం సమంత సన్నద్ధత..

## ఆ పుస్తకం చదువుతూ పోస్ట్!

స్టార్ హీరోయిన్ సమంత ప్రస్తుతం తన గర్భధారణ సమయాన్ని ఆస్వాదిస్తున్నారు. తన భర్త, ప్రముఖ దర్శకుడు రాజ్ నిడిమోరుతో కలిసి తొలి బిడ్డకు స్వాగతం పలికేందుకు సిద్ధమవుతున్న ఆమె, మాతృత్వానికి సంబంధించిన సన్నాహాలను ప్రారంభించారు. ఈ క్రమంలో తాను చదువుతున్న ఓ పుస్తకం తాలూకు ఫొటోను శనివారం అభిమానులతో పంచుకున్నారు.
'ఆగస్ట్ ఎనర్జీ' అనే క్యాప్షన్‌తో సమంత ఇన్‌స్టాగ్రామ్‌లో కొన్ని ఫొటోలను షేర్ చేశారు. అందులో ఆమె సోఫాలో విశ్రాంతి తీసుకుంటూ 'ఇనా మేస్ గైడ్ టు చైల్డ్‌బర్త్' అనే పుస్తకాన్ని చదువుతూ కనిపించారు. కాబోయే తల్లిదండ్రులకు ప్రసవానికి సంబంధించిన వివిధ అంశాలపై ఈ పుస్తకం అవగాహన కల్పిస్తుంది. ఈ పోస్టులో జిమ్ సెల్ఫీలతో పాటు తన భర్త పుట్టినరోజు వేడుకలకు సంబంధించిన మధుర క్షణాలను కూడా ఆమె పంచుకున్నారు.గత జూన్ నెలలో హైదరాబాద్‌లో నిర్వహించిన 'మా ఇంటి బంగారం' సక్సెస్ మీట్‌లో సమంత తన గర్భధారణ విషయాన్ని అధికారికంగా ప్రకటించిన సంగతి తెలిసిందే. "ఈ సినిమా తర్వాత నా ఆరోగ్య పరిస్థితి దృష్ట్యా చిన్న విరామం తీసుకుంటాను. మెటర్నిటీ లీవ్ తీసుకోవాల్సి ఉంటుంది. ఆ తర్వాత మళ్లీ నా అభిమానుల కోసం మరో సినిమాతో తిరిగి వస్తాను" అని ఆమె స్పష్టం చేశారు. గతేడాది డిసెంబర్ 2025లో కోయంబత్తూరులోని ఈశా యోగా సెంటర్‌లో రాజ్ నిడిమోరును సమంత వివాహం చేసుకున్నారు.


# 12న ఇరుముడి ట్రైలర్ విడుదలకు సన్నాహాలు

మాస్ మహారాజా రవితేజ కథానాయకుడిగా తెరకెక్కుతున్న తాజా చిత్రం 'ఇరుముడి' ట్రైలర్‌ను ఆగస్టు 12న విడుదల చేయనున్నారు. భీమవరంలోని ఓ ప్రైవేట్ కాలేజీలో ఈ ట్రైలర్ లాంచ్ కార్యక్రమాన్ని నిర్వహించేందుకు మేకర్స్ ప్లాన్ చేస్తున్నట్లు తెలుస్తోంది. 'నిన్ను కోరి', 'టక్ జగదీష్' వంటి చిత్రాలతో తనదైన గుర్తింపు తెచ్చుకున్న శివ నిర్వాణ ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తున్న ఈ చిత్రంపై ఇప్పటికే ప్రేక్షకుల్లో మంచి ఆసక్తి నెలకొంది.ఇప్పటివరకు సినిమాకు సంబంధించి విడుదలైన పోస్టర్లు, గ్లింప్స్, ఇతర ప్రచార చిత్రాలు ప్రేక్షకుల నుంచి పాజిటివ్ రెస్పాన్స్‌ను అందుకున్నాయి. ముఖ్యంగా కుటుంబ కథాంశానికి భక్తి అంశాలను జోడించి సినిమాను రూపొందిస్తున్నట్లు తెలుస్తుండటంతో 'ఇరుముడి'పై అంచనాలు మరింత పెరిగాయి. ట్రైలర్ విడుదల కార్యక్రమానికి చిత్ర బృందంతో పాటు అభిమానులు, సినీ ప్రేక్షకులు భారీగా హాజరయ్యే అవకాశం ఉంది. ఇప్పటికే 'ఇరుముడి' నుంచి వచ్చిన ప్రమోషనల్ కంటెంట్ సినిమాపై పాజిటివ్ వైబ్స్‌ను తీసుకొచ్చింది. దీంతో ట్రైలర్‌పై భారీ అంచనాలు నెలకొన్నాయి. కుటుంబ భావోద్వేగాలు, భక్తి అంశాలతో పాటు రవితేజకు సంబంధించిన మాస్ ఎలివేషన్స్‌ను ట్రైలర్‌లో ఎలా చూపించారనేది ఆసక్తికరంగా మారింది. ట్రైలర్ కూడా ప్రేక్షకులను మెప్పిస్తే సినిమా విడుదలకు ముందే హైప్ మరింత పెరిగే అవకాశం ఉంది. ముఖ్యంగా రవితేజను శివ నిర్వాణ ఏ తరహా పాత్రలో చూపించారనే విషయం ట్రైలర్ ద్వారా స్పష్టత వచ్చే అవకాశం ఉందని అభిమానులు భావిస్తున్నారు. ఈ సినిమాలో రవితేజ సరసన ప్రియా భవానీ శంకర్ కథానాయికగా నటిస్తున్నారు. రవితేజ కుమార్తె పాత్రలో బేబీ నక్షత్ర కనిపించనుంది. కుటుంబ బంధాలు, భావోద్వేగాలకు ప్రాధాన్యత ఉన్న కథలో ఈ తండ్రీకూతుళ్ల బంధం కీలకంగా ఉండబోతున్నట్లు తెలుస్తోంది. మాస్ మహారాజా ఇమేజ్‌కు భిన్నంగా కుటుంబ భావోద్వేగాలను, భక్తి అంశాలను కలగలిపి శివ నిర్వాణ ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నట్లు సమాచారం. దీంతో 'ఇరుముడి' రవితేజ కెరీర్‌లో మరో విభిన్నమైన సినిమాగా నిలుస్తుందా అన్న ఆసక్తి నెలకొంది. కాగా 'ఇరుముడి' ఆగస్టు 21న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది.




# కొరియన్ కనకరాజుతో హిట్ కొట్టిన వరుణ్ తేజ్

మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్‌కు గత కొంతకాలంగా హిట్ కోసం ఎదురుచూస్తున్నారు. తాజాగా ప్రేక్షకుల ముందుకు వచ్చిన 'కొరియన్ కనకరాజు' వరుణ్ తేజ్‌కు భారీ ఊరటనిచ్చేలా బాక్సాఫీస్ వద్ద దూసుకెళ్తోంది. మేర్లపాక గాంధీ దర్శకత్వం వహించిన ఈ హారర్ కామెడీ చిత్రంలో వరుణ్ తేజ్ సరసన రితిక నాయక్ హీరోయిన్‌గా నటించింది. సత్య కీలక పాత్రలో కనిపించారు. విడుదలకు ముందు నుంచే మంచి బజ్‌ను సొంతం చేసుకుంది. తాజా సమాచారం ప్రకారం 'కొరియన్ కనకరాజు' ప్రీమియర్స్, తొలి రోజు కలిపి రూ.10.2 కోట్లకు పైగా గ్రాస్ వసూలు చేసినట్లు చిత్ర బృందం ప్రకటించింది. హారర్ కామెడీ జోనర్‌లో తెరకెక్కిన సినిమాకు ఇది మంచి ఓపెనింగ్‌గా చెప్పొచ్చు. అంతేకాదు.. వరుణ్ తేజ్ కెరీర్‌లో ఇదే బిగ్గెస్ట్ ఓపెనర్గా నిలిచినట్లు మేకర్స్ వెల్లడించారు. గతంలో వరుణ్ తేజ్‌కు అత్యధిక ఓపెనింగ్ అందించిన 'గద్దలకొండ గణేశ్' సినిమాను 'కొరియన్ కనకరాజు' అధిగమించింది. దీంతో చాలా కాలం తర్వాత వరుణ్ తేజ్ అభిమానుల్లో కొత్త ఉత్సాహం కనిపిస్తోంది.దేశీయ మార్కెట్‌తో పాటు ఓవర్సీస్‌లోనూ సినిమా మంచి ఆరంభాన్ని అందుకుంది. ముఖ్యంగా అమెరికాలో ఇప్పటివరకు 1.75 లక్షల డాలర్ల గ్రాస్ సాధించినట్లు సమాచారం. సినిమా థియేట్రికల్ రైట్స్‌కు అనుగుణంగా చూస్తే ఇదే ట్రెండ్‌ను కొనసాగిస్తే బ్రేక్ ఈవెన్ దిశగా వెళ్లే అవకాశాలు ఉన్నాయని ట్రేడ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. విడుదలకు ముందే అడ్వాన్స్ బుకింగ్స్‌లో కూడా 'కొరియన్ కనకరాజు' మంచి జోరు చూపించింది. బుక్‌మైషో, డిస్ట్రిక్ట్ యాప్‌లలో కలిపి 2.5 లక్షలకు పైగా టికెట్లు అమ్ముడైనట్లు చిత్ర బృందం వెల్లడించింది. తొలి రోజు వసూళ్లతో పాటు సినిమాకు వస్తున్న మౌత్ టాక్ కూడా పాజిటివ్‌గా ఉండటం మేకర్స్‌కు మరింత కలిసొచ్చే అంశంగా మారింది.






# చిక్ కేఫే స్టైల్‌లో పూజా హెగ్డే గ్లామర్ షో.. యెల్లో డ్రెస్ హైలైట్!

బుట్టబొమ్మ పూజా హెగ్డే మరోసారి తన గ్లామర్‌తో సోషల్ మీడియాను షేక్ చేస్తున్నారు. విదేశీ వీధుల్లో, ఒక వినూత్నమైన కేఫే బ్యాక్‌డ్రాప్‌లో దిగిన ఆమె లేటెస్ట్ ఫొటోలు ఇప్పుడు నెట్టింట తెగ వైరల్ అవుతున్నాయి. పసుపు రంగు బాడీకాన్ డ్రెస్‌లో తన స్టైలిష్ లుక్స్‌తో కుర్రకారు హృదయాలను కొల్లగొడుతున్నారు. క్యూట్ ఎక్స్‌ప్రెషన్స్ ఇస్తూ షేర్ చేసిన ఈ గ్లామరస్ పిక్స్ అభిమానులను అమితంగా ఆకట్టుకుంటున్నాయి. ఆ ఫొటోషూట్ విశేషాలు మీకోసం.బుడాపెస్ట్ కేఫేలో చిక్ అండ్ గ్లామరస్ లుక్: ప్రస్తుతం వెకేషన్ మూడ్‌లో ఉన్న పూజా హెగ్డే, బుడాపెస్ట్‌లోని ఒక వినూత్నమైన కేఫేలో ఈ సరదా ఫొటోషూట్ చేశారు. గోడల నిండా చేతిరాత నోట్లు, నేలపై ఎండుగడ్డి చల్లి ఉన్న క్రియేటివ్ కేఫేలో ఒక కలప స్టూల్‌పై కూర్చుని ఆమె క్యూట్‌గా ఫోజులిచ్చారు. "పుట్ ద పెస్ట్ ఇన్ బుడాపెస్ట్" అని తన ఫొటోలకు ఇచ్చిన సరదా క్యాప్షన్ నెటిజన్లను భలే ఆకట్టుకుంటోంది. యెల్లో అవుట్‌ఫిట్ అట్రాక్షన్: ఈ ఫొటోషూట్‌లో పూజా హెగ్డే ధరించిన యెల్లో కలర్ ఫిట్టెడ్ మినీ డ్రెస్ ఆమె అందాన్ని మరింత పెంచింది. డీప్ వి-నెక్‌లైన్‌తో ఉన్న ఈ అవుట్‌ఫిట్‌కు తోడు ఓవర్ సైజ్డ్ క్రీమ్ షేడ్ సన్ గ్లాసెస్, కలర్‌ఫుల్ ప్యాటర్న్ వేస్ట్ బ్యాగ్ మరియు హైహీల్డ్ మెటాలిక్ ప్లాట్‌ఫార్మ్ శాండల్స్‌ను మ్యాచ్ చేశారు. ఇక తన పక్కనే కలర్‌ఫుల్ బ్యాగ్ ఉంచి, ఒక చేతితో జుట్టును సరిచేసుకుంటూ ఆమె ఇచ్చిన క్యూట్ స్మైల్ నెటిజన్లను ఫిదా చేస్తోంది. తొలి అడుగు నుంచి సౌత్, నార్త్ పాన్ ఇండియా రేంజ్: 'ముగమూడి' అనే తమిళ సూపర్ హీరో చిత్రంతో వెండితెరకు పరిచయమైన పూజా, తెలుగులో 'ఒక లైలా కోసం', 'ముకుంద' చిత్రాలతో మంచి గుర్తింపు తెచ్చుకున్నారు.

# రామాయణ తొలుత విదేశాల్లో విడుదల



రామాయణం ఇతిహాసం ఆధారంగా తెరకెక్కుతోన్న ప్రతిష్టాత్మక చిత్రం 'రామాయణ' ప్రపంచవ్యాప్త విడుదలపై నిర్మాత నమిత్ మల్హోత్రా కీలక ప్రకటన చేశారు. ఈ సినిమాను అంతర్జాతీయ మార్కెట్‌లో ముందుగా.. ఆ తర్వాత భారత్‌లో విడుదల చేసేలా వినూత్న వ్యూహాన్ని అనుసరిస్తున్నట్లు వెల్లడించారు. తాజాగా ఓ ఆంగ్ల మీడియాతో ఆయన మాట్లాడారు. నవంబర్ 6న విదేశాల్లో 'రామాయణ' విడుదల చేస్తున్నాం. విదేశీ మార్కెట్లలో సినిమాల విడుదల సాధారణంగా శుక్రవారం నుంచే ప్రారంభమవుతుంది. ఇండియాలో మాత్రం దీపావళి నవంబర్ 8 రోజే విడుదల చేస్తాం అని చెప్పారు. దిగ్గజ దర్శకుడు నితీశ్ తివారీ దర్శకత్వంలో రూపుదిద్దుకుంటున్న ఈ భారీ బడ్జెట్ దృశ్యకావ్యంలో శ్రీరాముడిగా రణ్‌బీర్ కపూర్, సీతగా సాయి పల్లవి, రావణాసురుడిగా యష్, హనుమంతుడిగా సన్నీ దేవోల్, లక్ష్మణుడిగా రవి దూబే నటిస్తున్నారు. ఆస్కార్ విజేతలు ఏ.ఆర్. రెహమాన్, హన్స్ జిమ్మర్ ఈ చిత్రానికి సంగీతం అందిస్తున్నారు. ఇండియాలో ధర్మ ప్రొడక్షన్స్ ఈ చిత్రాన్ని పంపిణీ చేస్తుండగా, ఓవర్సీస్ హక్కులను సోనీ పిక్చర్స్ దక్కించుకుంది. సంగీత హక్కులను టీ-సిరీస్ రూ. 75 కోట్లకు సొంతం చేసుకున్నట్లు సమాచారం.

# 1 బిలియన్ కలెక్షన్ల క్లబ్‌లో చేరిన ది ఒడిస్సీ

హాలీవుడ్ ప్రముఖ దర్శకుడు క్రిస్టోఫర్ నోలన్ తెరకెక్కించిన తాజా విజువల్ వండర్ 'ది ఒడిస్సీ' బాక్సాఫీస్ వద్ద సరికొత్త చరిత్ర సృష్టిస్తోంది. థియేటర్లలో విడుదలైన మూడు వారాల్లోనే ఈ ఫాంటసీ యాక్షన్ డ్రామా ప్రపంచవ్యాప్తంగా 1 బిలియన్ కలెక్షన్ల క్లబ్‌లో (దాదాపు రూ.9,500 కోట్లకు పైగా) అడుగుపెట్టింది క్రిస్టోఫర్ నోలన్ కెరీర్‌లో 1 బిలియన్ మార్కును అందుకున్న మూడో చిత్రంగా 'ది ఒడిస్సీ' నిలిచింది. అంతకుముందు ఆయన దర్శకత్వం వహించిన 'ది డార్క్ నైట్' (1.008 బిలియన్), 'ది డార్క్ నైట్ రైజెస్' (1.08 బిలియన్) ఈ ఘనత సాధించాయి. గతేడాది వచ్చిన 'ఓపెన్‌హైమర్' ఈ మార్కుకు కాస్త దూరంలో ఆగిపోయింది. కాగా, ఈ వీకెండ్ ముగిసేసరికి 'ది ఒడిస్సీ' నోలన్ కెరీర్‌లోనే అత్యధిక కలెక్షన్లు సాధించిన చిత్రంగా నిలవడం ఖాయమని విశ్లేషకులు భావిస్తున్నారు. ఒక్క ఐమాక్స్ స్క్రీన్ల నుంచే ఏకంగా 257 మిలియన్ డాలర్ల వసూళ్లు (దాదాపు రూ.2,445 కోట్లు) రావడం విశేషం. త్వరలోనే ఐమాక్స్ చరిత్రలోనే అత్యధిక వసూళ్లు సాధించిన చిత్రంగానూ ఇది నిలవనుంది. ప్రపంచంలోనే రెండో అతిపెద్ద మార్కెట్ అయిన చైనాలో ఈ సినిమా విడుదల కావాల్సి ఉంది. చైనా వ్యాప్తంగా దాదాపు 800 ఐమాక్స్ స్క్రీన్లతో పాటు వేలాది సాధారణ స్క్రీన్లలో అత్యంత భారీ స్థాయిలో విడుదల చేయడానికి మేకర్స్ ఎ÷-లాన్ చేస్తున్నారు. దీంతో ఈ సినిమా మరిన్ని రికార్డులను తిరగరాయడం ఖాయంగా కనిపిస్తోంది.

